News Daily

ఎడిటర్ :

B. ఉపేందర్

cknews7484@gmail.com

Visit in :
www.cknewstv.in

CK
చంద్ర కాంత్

NEWS
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :297 | ఖమ్మం | శనివారం, నవంబర్ 28, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



లోక్‌సభ సీట్ల పెంపునకు
కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్!

- అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్ల పెంపునకు ప్రతిపాదన
- 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన
- 2051 వరకు కొనసాగనున్న సీట్ల పెంపు ప్రతిపాదన
- 2029 ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్ల అమలుకు కసరత్తు
- రాజ్యాంగ సవరణ బిల్లుకు విపక్షాల మద్దతు కీలకం

2లో

దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు చెక్ పెట్టేలా సవరణలు

పెట్టుబడులు, పర్యావరణం
రెండు కళ్లు



- రెండింటికీ సమాన ప్రాధాన్యం
- ప్రకృతి పరిరక్షణ విషయంలోనూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఉంటుంది
- వచ్చిన సలహాలు, సూచనలతో ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నాం
- రైతులపైనా బాధ్యత ఉంది... రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదు

హైదరాబాద్

తమకు పర్యావరణం, పెట్టుబడులు రెండూ రెండు కళ్ల వంటివని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పెట్టుబడుల సదస్సుతోపాటు పర్యావరణానికి కూడా తాము సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ రెండింటినీ సమతుల్యం చేయాలని భావించామన్నారు. 'సహజ వనరులను చెరబట్టి విధ్వంసం చేస్తే వచ్చే పరిణామాలే సునామీలు, కరువు వంటి ప్రకృతి విపత్తులు. సమతుల్యత పాటించకపోతే భవిష్యత్ తరాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది' అని అన్నారు. అందుకే ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీశ్రీ రవిశంకర్, వాటర్‌మన్ ఆఫ్ ఇండియా - మిగతా3లో

యువత భవిష్యత్తుకు
డ్రగ్స్ ముప్పు



- నిర్మూలనకు కిషన్‌రెడ్డి పాదయాత్ర
- నషా ముక్త్ భారత్ దిశగా అడుగులు.. యాత్రలో నాగార్జున సందేశం
- డ్రగ్స్‌కు నో చెప్పాలి.. యువతకు సినీ ప్రముఖుల పిలుపు
- డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా కిషన్‌రెడ్డి పాదయాత్ర
- అమీర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు మూడోరోజు యాత్ర
- నాగార్జున, బోయపాటి శ్రీను, సాయికుమార్ తదితర సినీ ప్రముఖుల సంఘీభావం



మిషన్ 360తో కేంద్రం వ్యూహం
ఈసారైనా డీలిమిటేషన్ బిల్లు గట్టెక్కేనా?

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది



- ఇరుదేశాల దీర్ఘకాల సమస్యలు పరిష్కార దిశగా అడుగులు
- 2026 సమ్మిట్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన
- ఈయూతో ఒప్పందం కూడా వచ్చే ఏడాది నుంచే అమలు
- అమెరికా ప్రతిపాదించిన 25 శాతం సుంకాల వేళ కీలక ప్రకటన

నేడు ఇండీ కూటమి కీలక భేటీ

- పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై వ్యూహరచన..
- డీలిమిటేషన్ బిల్లును అడ్డుకునేందుకు కార్యాచరణ
- ఎంపీలకు విప్ జారీ చేసిన కాంగ్రెస్.. కేంద్రం తీరుపై విపక్షాల ఆగ్రహం



విదేశీ ఉద్యోగాలకు
ఆర్థిక భరోసా



- విదేశీ ఉద్యోగాలకు వెళ్లే యువతకు తెలంగాణ సర్కారు ఆర్థిక చేయూత!
- 'సీఎం విదేశీ ఉద్యోగనిధి' పథకం ప్రకటించిన ప్రభుత్వం
- తొలి ఏడాది 7 వేల మందికి లబ్ధి.. అర్హులకు రూ.50 వేల నుంచి రూ.1.75 లక్షల వరకు ఆర్థిక సాయం

హైదరాబాద్

విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనే ఆశయం ఉన్న నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విదేశీ ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్న నిరుపేద యువతకు అండగా నిలిచేందుకు 'సీఎం విదేశీ ఉద్యోగనిధి పథకం' ప్రకటించింది. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా ఈ పథకాన్ని అమలు చేయనుంది. విదేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన వీసా, విమాన ప్రయాణం, విదేశీ భాషల శిక్షణ వంటి ఖర్చుల కోసం అర్హులకు ప్రభుత్వం ఆర్థిక సాయం - మిగతా3లో



మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఖాయం..
కాంగ్రెస్ ఆపలేదు

- మహిళా కోటాను కాంగ్రెస్, రాహుల్ ఆపలేరని వ్యాఖ్య
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి అమలు ఖాయమన్న షా
- నవంబరు 30 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు
- రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే గౌరవించినట్లు కాదని రాహుల్‌పై విమర్శలు
- 18 నెలల ఎమర్జెన్సీతో రాజ్యాంగాన్ని బంధించింది కాంగ్రెస్సేనని ధ్వజం

విద్యుత్ రంగానికి కేంద్రం
సహకరించాలి



- రూ.25,096 కోట్ల డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలపాలి
- పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందించాలి
- విద్యుత్ మంత్రుల సదస్సులో కేంద్రానికి డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తి

వివరాలు 3లో..

పెట్టుబడులు, పర్యావరణం రెండు కళ్లు

-మొదటిపేజీ తరువాయి

డా.రాజేంద్ర సింగ్‌తోపాటు పర్యావరణవేత్తల నుంచి పెట్టుబడుల ఆకర్షణతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నామన్నారు. వచ్చిన సలహాలు, సూచనలతో ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఐటీసీ కాకతీయ హోటల్‌లో తెలంగాణ క్లైమేట్ కాన్‌క్లేవ్--2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పెట్టుబడుల కోసమే ఈ సదస్సును నిర్వహించడం లేదన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అనుభవజు?ఇలతో చర్చించి ఒక విధానాన్ని రూపొందించడానికే ఈ కాన్‌క్లేవ్‌ను ఏర్పాటు చేశామన్నారు.



తెలంగాణది చెరువుల చరిత్ర

'వందేళ్ల క్రితం కొమురం భీం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జల్, జమీన్, జంగల్ కోసం పోరాటం చేశారు. జల్, జమీన్, జంగల్ కోసం త్యాగాలు చేసిన చరిత్ర మనది. రేచర్ల రుద్రదేవుడు, రాణి రుద్రమదేవి వరంగల్‌లో అనేక చెరువులను తవి?వంచారు. రామప్ప, పాకాల వంటి చెరువులు నిర్మించారు. మేము ఎవరి నుంచి నకలు చేయాల్సిన అవసరం లేదు. గుజరాత్ మోడల్‌ను కాపీ చేయాల్సిన అవసరం లేదు. మన చరిత్ర నుంచే స్ఫూర్తి పొందుతున్నాం. మహమ్మద్ బిన్ ఖిల్జీని రేచర్ల రుద్రదేవుడు మూడుసార్లు ఓడించారు. కాకతీయుల కాలంలో గొలుసుకట్టు చెరువులను నిర్మించారు. తెలంగాణది చెరువుల చరిత్ర' అని అన్నారు. "చెరువులను ఆక్రమించడం వల్ల వరద నీరు వెళ్లడానికి దారి లేక కాలనీల్లోకి ప్రవేశించి ముంచెత్తుతోంది. ఈ విషయంలో పేదలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వడం లేదు. నష్టపోయిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. మూసీ మురికికూపంలా మారింది. భవిష్యత్తులో అత్యంత సుందరమైన మూసీ నదిని తీర్చిదిద్దుతాం. మూసీపై అనేక అభ్యంతరాలు వచ్చినా వెనక్కి తగ్గలేదు. భావి తరాల కోసం పనిచేస్తున్నాం..అందుకే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం' అని రేవంత్ తెలిపారు.

కోవిడ్ తరహాలోనే ఎదుర్కోవాలి...

'భవిష్యత్ తరాల కోసం ఈ కార్యక్రమాలను చేపడుతున్నాం. ఫలితాలు ఈరోజు రావొచ్చు.. రేపు రావొచ్చు. సునామీలు, భూకంపాలు వస్తే నష్టం వెంటనే జరుగుతుంది. కానీ కరువు అలా కాదు. ఎల్‌నినో ప్రభావం ఒక్క తెలంగాణలోనే లేదు. ప్రపంచంలోని అనేక దేశాల్లో దీని ప్రభావం ఉంది. వాతావరణ మార్పులను ఎదుర్కోవాలి. 2 గంటల్లో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అందరం వాతావరణ మార్పులపై దృష్టి పెట్టాలి. వచ్చే రెండేళ్లకు సరిపోయే తిండి గింజలు ఉన్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తుంది. కానీ నీళ్లు లేవు. ఈ సమస్యలను అధిగమించాలి. కరువును రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలి. కోవిడ్ తరహాలోనే కలిసికట్టుగా అంతా కలిసి ఎల్‌నినోను ఎదుర్కోవాలి' అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

తప్పు చేసినవాళ్లను వదలం..

'రైతులు ఒక పంటను త్యాగం చేస్తే పశుపక్ష్యాదులకు నీళ్లు ఉంటాయి. మానవాళిని కాపాడుకునే బాధ్యత రైతులకు ఉంది. రైతుల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. తెలంగాణ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. 'రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదు. అనేక పాలసీలు తెచ్చాం. 3 వేల మందితో ఈగల్ ఫోర్స్ డ్రగ్స్‌ను నియంత్రిస్తోంది. కేంద్రం కూడా ఈగల్ ఫోర్స్‌ను అభినందించింది. ఆహార కల్తీ నియంత్రణకు టీజీ సేఫ్ తీసుకువచ్చాం. చెరువుల పునరుద్ధరణకు హైడ్రా తెచ్చాం. ఈ మూడు సంస్థలు దేశంలో ఎక్కడా లేవు' అని అన్నారు.

'డ్రగ్స్‌ను కఠినంగా అణచివేస్తున్నాం.. వారిని వదలడం లేదు. డ్రగ్స్ వల్ల పంజాబ్ తీవ్రంగా నష్టపోయింది. సీఎం కుర్చీలో నేను ఉన్నంతకాలం తప్పు చేసినవాళ్లను వదలం' అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ సంజయ్‌జాజు, అటవీశాఖ స్పెషల్ సీఎస్ జయేశ్‌రంజన్, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్, పద్మశ్రీ చింతల వెంకటరెడ్డి, పదినగరాల మేయర్లు, పదిమంది సర్పంచ్‌లు, పాడి, తోటరైతులు, మహిళాసంఘాల ప్రతినిధులు, ఎన్జీవోలు, వివిధరంగాల నిపుణులు చర్చల్లో పాల్గొన్నారు. ఈ కాంక్లేవ్ కర్టన్‌రైజర్‌లో భాగంగా 'పట్టణ వాతావరణమార్పుల సవాళ్లు--ప్రజారోగ్యం', నీటి భద్రత, నీటిపారుదలరంగం, జీవవైవిధ్యం, అడవులు పర్యావరణ వ్యవస్థ, పునరుత్పాదక ఇంధనం, సర్క్యులర్ ఎకానమీ తదితర అంశాలపై రైతులు, పర్యావరణవేత్తలు, ఎన్జీవోలు, సర్పంచ్‌లు, అధికారులు, నిపుణులు ఐదు బృందాలుగా ఏర్పడి జరిపిన సమాలోచనల ఆధారంగా పలు సూచనలను ప్రభుత్వానికి అందజేశారు.

విదేశీ ఉద్యోగాలకు ఆర్థిక భరోసా

-మొదటిపేజీ తరువాయి

అందించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 7 వేల మందికి ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించింది.

విదేశాల్లో నిర్మాణ, తయారీ, సాంకేతిక, వైద్య సహాయక సేవలు తదితర రంగాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయి. అయితే విదేశీ ఉద్యోగాలపై సరైన అవగాహన లేకపోవడం, అవసరమైన నైపుణ్యాలు, భాషా పరిజ్ఞానం లేకపోవడం, విదేశాలకు వెళ్లేందుకు అధిక ఖర్చులు కావడంతో పేద కుటుంబాల యువత ఈ అవకాశాలను అందుకోలేకపోతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన యువతకు ప్రత్యేక సాయం అందించాలని నిర్ణయించింది. యువత సురక్షితంగా, చట్టబద్ధమైన మార్గాల్లో విదేశీ ఉద్యోగాల్లో చేరేందుకు టామ్‌కామ్ ద్వారా సహకారం అందించనుంది.

తొలి ఏడాది 7 వేల మందికి లబ్ధి

ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 7 వేల మందికి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రెండు కేటగిరీలుగా అభ్యర్థులను విభజించింది.

- మొదటి కేటగిరీ: విదేశీ భాషల్లో ప్రత్యేక శిక్షణ, పరీక్షలు అవసరం లేకుండా నేరుగా ఉద్యోగాలకు వెళ్లే 5,880 మంది.
- రెండో కేటగిరీ: విదేశీ భాషల్లో ప్రావీణ్యం అవసరమైన ఉద్యోగాలకు వెళ్లే 1,120 మంది.

అభ్యర్థుల విద్యార్హతలు, ఆసక్తి, వృత్తి నైపుణ్యాలు, విదేశాల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగాల ఆధారంగా కేటగిరీలను నిర్ణయిస్తారు.

మొదటి కేటగిరీకి రూ.50 వేల సాయం

విదేశీ భాషల్లో ప్రత్యేక శిక్షణ, పరీక్షలు అవసరం లేకుండా నేరుగా ఉద్యోగాలకు వెళ్లే అభ్యర్థులకు వీసా, విమాన ప్రయాణ ఖర్చుల కోసం గరిష్ఠంగా రూ.1 లక్ష వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఇందులో 50 శాతం సబ్సిడీగా ప్రభుత్వం గరిష్ఠంగా రూ.50 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తుంది.

రెండో కేటగిరీకి రూ.1.75 లక్షలు

జపనీస్, జర్మన్ తదితర విదేశీ భాషల్లో ప్రావీణ్యం అవసరమైన ఉద్యోగాలకు వెళ్లే అభ్యర్థులను రెండో కేటగిరీలో చేర్చారు. వీరికి గరిష్ఠంగా రూ.3.50 లక్షల వరకు ఖర్చును పరిగణనలోకి తీసుకుంటారు. ఇందులో 50 శాతం సబ్సిడీ రూపంలో గరిష్ఠంగా రూ.1.75 లక్షల వరకు ప్రభుత్వం అందించనుంది. విదేశీ భాషల పరిజ్ఞానం అవసరమైన ఉద్యోగాలను పొందేందుకు ఈ సాయం ఉపయోగపడనుంది.

పది రంగాల్లో ఉద్యోగావకాశాలు

వివిధ రంగాల్లో విదేశీ ఉద్యోగాలకు వెళ్లే అభ్యర్థులకు ఈ పథకం వర్తించనుంది. ప్రధానంగా కింది రంగాలను ప్రభుత్వం గుర్తించింది.

1. నిర్మాణ, మౌలిక సదుపాయాలు
2. తయారీ పరిశ్రమలు
3. ఆటోమొబైల్ రంగం
4. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్
5. రవాణా, లాజిస్టిక్స్
6. ఫెసిలిటీ మేనేజ్‌మెంట్
7. వైద్య సహాయక సేవలు
8. హోటళ్లు, పర్యాటకం
9. మరమ్మతులు, నిర్వహణ
10. గృహ, వ్యక్తిగత సేవలు

విదేశీ ఉద్యోగ సంస్థలతో భాగస్వామ్యాలు, ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రభుత్వాల మధ్య కార్మిక ఉపాధి ఒప్పందాల ద్వారా ఉద్యోగావకాశాలను విస్తరించనున్నారు.

18 నుంచి 40 ఏళ్ల వారికి అవకాశం

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. అయితే ఆయా దేశాలు, ఉద్యోగ సంస్థల నిబంధనల ప్రకారం వయోపరిమితిలో మార్పులు ఉండవచ్చు. అభ్యర్థులు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలంగాణలో చదివి ఉండాలి. ఐటీఐ అర్హతతో విదేశీ ఉద్యోగాలకు వెళ్లేవారు తెలంగాణలోని గుర్తింపు పొందిన సంస్థల్లో ఐటీఐ పూర్తి చేసి ఉండాలి.

దరఖాస్తుదారులకు తప్పనిసరి అర్హతలు

పథకం కింద ఆర్థిక సాయం పొందాలంటే అభ్యర్థులు కొన్ని నిబంధనలు పాటించాలి.

- సంబంధిత వృత్తిలో కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- దరఖాస్తు చేసుకునే సమయానికి పాస్‌పోర్టు గడువు కనీసం ఆరు నెలలు ఉండాలి.
- ఉద్యోగ సంస్థలు సూచించిన వైద్య పరీక్షల్లో అర్హత సాధించాలి.
- ఒక కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పథకం వర్తిస్తుంది.
- మొత్తం లబ్ధిదారుల్లో మహిళలకు కనీసం 33 శాతం కేటాయిస్తారు.
- దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ఉంటుంది.
- తగిన సంఖ్యలో అర్హులు అందుబాటులో లేకపోతే రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదంతో ఇతరులకు అవకాశం కల్పిస్తారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు

ఈ పథకానికి టామ్‌కామ్ ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆఫ్‌లైన్ దరఖాస్తులను స్వీకరించరు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు తదితర అవసరమైన పత్రాలను సమర్పించాలి. అభ్యర్థుల బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి.

జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎంపిక

ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను తొలుత జిల్లా ఉపాధి కల్పన అధికారి పరిశీలించి ప్రాథమిక జాబితా రూపొందిస్తారు. అనంతరం ఆర్డీవో లేదా తహసీల్దార్ దరఖాస్తుల్లోని వివరాలను ధ్రువీకరిస్తారు. అదనపు పత్రాలు అవసరమైతే అభ్యర్థులకు సమాచారం అందిస్తారు. జిల్లాస్థాయి కమిటీ అర్హులను గుర్తించి రాష్ట్రస్థాయి కమిటీకి సిఫారసు చేస్తుంది. రాష్ట్రస్థాయి కమిటీ తుది లబ్ధిదారుల జాబితాకు ఆమోదం తెలుపుతుంది. దరఖాస్తుల గడువు ముగిసిన తర్వాత లేదా రిజిస్ట్రేషన్ పూర్తయిన 30 రోజుల్లో ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి కేటగిరీ అభ్యర్థులు సంబంధిత విదేశీ ఉద్యోగ సంస్థ నిర్వహించే ఇంటర్వ్యూలో ఎంపిక కావాల్సి ఉంటుంది.

నిరుద్యోగ యువతకు కొత్త అవకాశం

విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనే లక్ష్యం ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేక వెనుకబడుతున్న యువతకు ఈ పథకం ఉపయోగపడనుంది. ముఖ్యంగా గ్రామీణ, నిరుపేద కుటుంబాల యువతకు అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్‌లో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఆర్థికంగా తోడ్పడనుంది. అయితే అర్హతలు, ఎంపిక నిబంధనలు, ఉద్యోగ సంస్థల విశ్వసనీయతను పరిశీలించుకుని యువత దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

విద్యుత్ రంగానికి కేంద్రం సహకరించాలి



న్యూఢిల్లీ: తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసార, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్‌లో కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో భట్టి పాల్గొని పలు అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద స్మార్ట్ మీటర్లు, పంపిణీ నష్టాల తగ్గింపు, ఆధునికీకరణకు రూ.25,096 కోట్ల విలువైన డీపీఆర్‌లను మే 27న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సమరి?ప ంచామని భట్టి తెలిపారు. ఇప్పటివరకు కేవలం రూ.72 కోట్లు మాత్రమే అందాయని, పెండింగ్ డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలిపి, పనుల గడువును 2028 మార్చి 31 వరకు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) అందించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. టీజీ జెన్‌కో చేపట్టనున్న కల్లూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు సీఈఏ త్వరితగతిన ఆమోదం తెలపాలని, 2,000 మెగావాట్ అవర్ల బ్యాటరీ నిల్వ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలన్నారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించడంతో కృతజ్ఞతలు తెలిపారు. అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీల లెక్కింపును ప్రతినెలా వెల్లడిస్తూ, ఏడాదికి ఒక్కసారి సర్దుబాటు చేసే పారదర్శక విధానం తేవాలని భట్టి సూచించారు. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు ప్రసార ఛార్జీల మినహాయింపును 2030 మార్చి 31 వరకు పొడిగించాలన్నారు. రాయ్‌గఢ్--పుగళూర్--త్రిస్సూర్ హెచ్‌వీడీసీ లైన్‌కు పూర్తి జాతీయహోదా ఇవ్వడంతోపాటు సేదం--పరిగి 400 కేవీ లైన్, మహేశ్వరం--2 సబ్‌స్టేషన్లను అంతర్రాష్ట్ర ప్రాజెక్టులుగా చేపట్టాలన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ కొరత నివారణకు 2027 ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 30 వరకు దేశంలోని అన్ని గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలను అందుబాటులో ఉంచేలా విద్యుత్ చట్టం సెక్షన్--11 కింద ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సదస్సులో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

రూ.200 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాలు: కేంద్ర మంత్రి భట్టర్

రాబోయే రెండు దశాబ్దాల్లో దేశ విద్యుత్ రంగంలో రూ.200 లక్షల కోట్ల భారీ పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రైవేట్ రంగం సమష్టిగా కృషి (టీమ్‌వర్క్) చేస్తేనే ఈ లక్ష్యాన్ని సాధించగలమని కేంద్ర విద్యుత్, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ భట్టర్ స్పష్టం చేశారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉత్పత్తి, స్టోరేజ్, ట్రాన్స్‌మిషన్, పంపిణీ వ్యవస్థలను ఒకే ఏకీకృత విధానంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు.

యువత భవిష్యత్తుకు డ్రగ్స్ ముప్పు..

హైదరాబాద్: దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టి, యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి చేపట్టిన 'నషా ముక్త్ భారత్' పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లభిస్తోంది. మూడోరోజు శుక్రవారం హైదరాబాద్‌లోని అమీర్‌పేట నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఫిల్మ్‌నగర్ వరకు కొనసాగనుంది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించడంతో పాటు యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

యాత్రలో పాల్గొన్న సినీ ప్రముఖులు

అమీర్‌పేటలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున, దర్శకుడు బోయపాటి శ్రీను, నటుడు సాయికుమార్ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా నాగార్జున కార్యక్రమానికి హాజరైన వారితో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఇతరులకు కూడా వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించాలని పిలుపునిచ్చారు.

ప్రజల నుంచి మంచి స్పందన

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నషా ముక్త్ భారత్ యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. యువత, విద్యార్థులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా యాత్రలో పాల్గొంటుండటం సంతోషకరమన్నారు. ప్రజల భాగస్వామ్యం చూస్తుంటే డ్రగ్స్ రహిత భారత్ సాధ్యమనే నమ్మకం మరింత బలపడుతోందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన ఒక్క ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

డీఅడిక్షన్ కేంద్రాల పెంపునకు చర్యలు

డ్రగ్స్‌కు బానిసలైన వారిని తిరిగి సాధారణ జీవనంలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. దేశవ్యాప్తంగా డీఅడిక్షన్ కేంద్రాల సంఖ్యను పెంచడం, బాధితులకు వైద్య చికిత్సతో పాటు కౌన్సెలింగ్ అందించడం, పునరావాస సదుపాయాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించినట్లు వివరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువత ఆరోగ్యం, కుటుంబాలు, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ స్థాయిలో సమన్వయం

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరా వ్యవస్థలను అరికట్టేందుకు భారత్ పలు దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుని సమన్వయంతో పనిచేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌లను గుర్తించడం, అక్రమ రవాణాను నియంత్రించడం, సరఫరా మార్గాలను అడ్డుకోవడం వంటి అంశాలపై చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల సహకారం కూడా కీలకమని పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన

పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా ముందస్తు చైతన్యం కల్పించడం, డ్రగ్స్ వినియోగానికి దారితీసే పరిస్థితులను గుర్తించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు.

యువత భవిష్యత్తు కోసం సామాజిక ఉద్యమం

డ్రగ్స్ సమస్యను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా సామాజిక సమస్యగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఈ యాత్ర ద్వారా నిర్వాహకులు సందేశం ఇస్తున్నారు. యువతలో అవగాహన పెంపు, మాదకద్రవ్యాల అక్రమ సరఫరాపై నిఘా, బాధితులకు చికిత్స, పునరావాసం వంటి అంశాలపై సమాజం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిస్తున్నారు.

డ్రగ్స్‌కు మొదటిసారే నో చెప్పాలి: చిరంజీవి

మన పోరాటం మాదకద్రవ్యాలపైనే.. బాధితులపై కాదు

దురలవాట్లను మొదటిసారే నిర్మోహమాటంగా వ్యతిరేకించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మద్యపానం వంటి వ్యసనాలు తెలియకుండానే అలవాటుగా మారుతాయని, జీవిత లక్ష్యాలను చేరుకోవాలంటే ఎన్ని ప్రలోభాలు ఎదురైనా మద్యం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. "మన పోరాటం డ్రగ్స్ మీద మాత్రమే.. డ్రగ్స్ బాధితుల మీద కాదు" అని చిరంజీవి స్పష్టం చేశారు. వ్యసనాలకు బానిసైన వారిని దూరం పెట్టకుండా, వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా కిషన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు యువత, తల్లిదండ్రులు, సమాజం కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు 8 వేల మంది క్రీడాకారులు!

ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష

డిసెంబర్ 11న ప్రారంభోత్సవం.. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి

డిసెంబర్ 8న భారత్ ఫ్యూచర్ సిటీలో రక్షణ రంగ ఎక్స్‌పో, ఎయిర్ షో

క్రీడాకారులకు వసతి, రవాణా, వైద్య సదుపాయాలు కల్పించాలి

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు.. భోజనం, తాగునీటి ఏర్పాట్లు



హైదరాబాద్ : తెలంగాణలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సమీక్ష నిర్వహించారు. శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన, కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

డిసెంబర్ 8న రక్షణ రంగ ఎక్స్‌పో, ఎయిర్ షో

డిసెంబర్ 8న భారత్ ఫ్యూచర్ సిటీలో రక్షణ రంగ ఎక్స్‌పో, ఎయిర్ షో నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు భారీ సంఖ్యలో విద్యార్థులను తరలించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని టీజీఎస్ఆర్టీసీ అధికారులకు సూచించారు. వారికి భోజనం, అల్పాహారం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు.

8 వేల మంది క్రీడాకారుల రాక

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సుమారు 8 వేల మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందని సీఎస్ వెల్లడించారు. క్రీడాకారులకు అవసరమైన వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు.

డిసెంబర్ 11న జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవానికి విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎస్ ఆదేశించారు. ప్రారంభ, ముగింపు వేడుకల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడా పోటీలకు విస్తృతంగా మీడియా కవరేజీ కల్పించి, కార్యక్రమాల వివరాలు ప్రజలకు చేరేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు

నాగలవంచలో కొత్తగా మంజూరైన పెన్షన్ పత్రాలు అందజేసిన నారగని రాంబాయి.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.. చింతకాని నవంబర్ 27 మండలంనాగులవంచ గ్రామపంచాయతీలో కొత్తగా మంజూరైన పెన్షన్లకు సంబంధించిన పత్రాలను సర్పంచ్ నారగాని రాంబాయి లబ్ధిదారులకు అందజేశారు.
ఎన్నో ఏళ్లుగా పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న అర్హులకు ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయడంతో గ్రామంలో ఆనందోత్సవాలు నెలకొన్నాయి.
ఈ సందర్భంగా వృద్ధాప్య, గీత కార్మిక, వితంతు, మరియు ఒంటరి మహిళలు,తదితర విభాగాలకు చెందిన లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను అందజేశారు.
ప్రభుత్వ నుంచి పెన్షన్లు మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.లి ఈ సందర్భంగా సర్పంచ్ నారగాని రాంబాయి మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వసంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొంటూ తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబటి శరత్ కుమార్, గ్రామ పంచాయితీ కార్యదర్శి బుద్దే చిరంజీవి, దేవాలయం మాజీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు, రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్ అంబటి శాంతయ్య, వార్డు సభ్యులు గురిజాల జయకుమార్, అనగాని జానకి, కాసాని బాల కుమార్, గ్రామ పెద్దలు బైరు శ్రీరాములు. కొండా గోపి, గార్లపాటి కాంతారావు, గంధం కృష్ణ, బైరు వెంకటేశ్వర్లు, మరియు గ్రామస్తులు, పెన్షన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం

- ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏన్మూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా శిక్షణ
- విద్యార్థినీ విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామంపై అవగాహన



సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్మూరు నవంబర్ 27 2026: విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏన్మూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారం రోజులుగా యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. యోగా ఉపాధ్యాయురాలు కె. పూజిత ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు యోగాకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణ అందిస్తున్నారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత, వివిధ రకాల యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర అంశాలను వివరిస్తూ వాటిని ఆచరించే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. యోగాసనాలను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలియజేస్తున్నారు.
ప్రస్తుత విద్యావిధానంలో విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని, యోగా సాధన వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని శిక్షణ సందర్భంగా వివరించారు. విద్యార్థి దశ నుంచే యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి దోహదపడుతుందని సూచించారు.
ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాచలం, స్టూడెంట్ కౌన్సిలర్ చావా సాంబశివరావు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి. రమాదేవి, యోగా ఉపాధ్యాయురాలు కె. పూజిత, అధ్యాపకులు విజయలక్ష్మి, రామారావు, లక్ష్మీనరసింహారావు, లైబ్రేరియన్ కవిత తదితరులు పాల్గొన్నారు. వారం రోజులుగా కొనసాగుతున్న ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

తిరుమలాపురంలో కొత్త పింఛన్ల గుర్తింపు పత్రాల పంపిణీ



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి..చింతకాని, :మండలంలోని తిరుమలాపురం గ్రామంలో కొత్తగా మంజూరైన ఆసరా పింఛన్ల గుర్తింపు పత్రాలను సర్పంచ్ చాపలమడుగు వీరబాబు అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో అర్హత కలిగిన వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతో పాటు కల్లుగీత కార్మికులకు కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పింఛన్లతో నిరుపేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, కొత్తగా పింఛన్లు పొందిన లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల సమస్యలపై ఆరా.. పరిష్కారానికి జీసీడీవో హామీ



- కస్తూరిబా పాఠశాలను పరిశీలించిన జీసీడీవో
- ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపంపై తల్లిదండ్రుల ఫిర్యాదు
- సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ

సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్మూరు నవంబర్ 27 2026: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో రూబీ, ఎంఈఓ వాసవీ దేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యా, బోధన, ఇతర నిర్వహణ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడి, విద్యార్థినులకు ఎదురవుతున్న సమస్యలు, పాఠశాలలోని పరిస్థితులపై ఆరా తీశారు.
ఈ సందర్భంగా తల్లిదండ్రులు పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల మధ్య సరైన సమన్వయం లేదనే భావన తమకు కలుగుతోందని, ఈ పరిస్థితి విద్యార్థినులపై ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల మధ్య సమన్వయం కొరవడటంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాలలో బోధనతో పాటు విద్యార్థినుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లోనూ ఉపాధ్యాయులందరూ సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.తల్లిదండ్రులు వెల్లడించిన సమస్యలను జీసీడీవో రూబీ శ్రద్ధగా విన్నారు. పాఠశాలలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, వారి మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తెలిపిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలలో ప్రశాంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి, విద్యార్థినుల చదువుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా అవగాహన కల్పించాలి



సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 27, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న బీమా నమోదు కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ కార్డుల ఆధారంగా లబ్ధిదారుల వివరాలు, నామినీ వివరాల నమోదు, ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు.
18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులందరూ పథకంలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నమోదు పూర్తయిన వారికి రసీదులు, ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని, సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.రుద్రంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 1,250 రేషన్ కార్డులు ఉండగా, తొలిరోజు 65 మంది వివరాలు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం నమోదు పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు కలెక్టర్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

29న ఖమ్మంలో ఆర్యవైశ్య వనభోజనాలు



ఖమ్మం, నవంబర్ 27 (సి. కె. న్యూస్ ప్రతినిధి)ఖమ్మం నగరంలోని చెరుకూరి వారి తోటలో ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం మరియు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య అన్న సత్రం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం చెరుకూరి వారి తోటలో ఆర్యవైశ్య వనభోజనాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య వన సమారాధన కమిటీ కన్వీనర్ చెరుకూరి కృష్ణమూర్తి, కో-కన్వీనర్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ, ఆదివారం ఉదయం 7:30 గంటలకు గోపూజ, 8 గంటలకు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, 10:30 గంటలకు మహాశివునికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఉదయం 9 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు, చిన్నపిల్లలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి విందు భోజనాలు ప్రారంభమవుతాయని తెలిపారు.
ఈ వన సమారాధన కార్యక్రమానికి ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు, కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. విలేకరుల సమావేశంలో పసుమర్తి సీతా చంద్ర రావు, చిన్ని కృష్ణారావు, గుమ్మడవెల్లి శ్రీనివాస్, గోళ్ళ రాధాకృష్ణమూర్తి, వేములపల్లి వెంకటేశ్వరరావు,పులిపాటి ప్రసాద్,రాయపూడి రవికుమార్, రాయపూడి జయరాం, మాశెట్టి వరప్రసాద్, పసుమర్తి సాంబశివరావు, గోళ్ళ మురళీకృష్ణ, తేరాల ప్రవీణ్ కుమార్, కొదమూరు జగన్నాథం, వూటూరు లక్ష్మీ నరసింహారావు యడమకంటి రామారావు, బూర్ల పుల్లారావు, కందికొండ వేణుగోపాలరావు , కొంకిమల్ల మృత్యుంజయరావు, రాయపూడి బలరామ్మూర్తి, పాలవరపు శ్రీనివాస్, చారు గుండ్ల రవి, రంగా శ్రీనివాసరావు, చెరుకూరి యుగంధర్, రంగా పురుషోత్తం, కురువెళ్ళ లక్ష్మీనారాయణ, కొంకిమల్ల విశ్వనాథశీ, వంగవీటి హరీష్, రాయపూడి ఫణిరాజ్, తేలుకుంట్ల ఓంకార్, కాజా వెంకటేశ్వరరావు, తేరాల భాస్కరరావు, రాయల బసవేశ్వర రావు,వెల్లంపల్లి సుబ్బారావు, మాశెట్టి తిరుమలరావు,తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి,

రబీలో రైతులు ఆరు తారీ పంటలు వేసుకోవాలి,



సీ కే న్యూస్ చేగుంట :చేగుంట మండలం జైత్రం తాండా లో నిర్వహించిన ఎల్ నినో గ్రామసభకు మండల స్థాయి అధికారులు హాజరైనారు. గ్రామసభ లో ఎంపీడీవో చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన ప్రజలకు వచ్చే సమస్యల గురించి వివరించడమైనది. రైతులు ఎక్కువగా కూరగాయల పంటలు పెట్టుటకు ప్రాధాన్యం ఇవ్వగలరని తెలిపినారు గ్రామసభ అనంతరం జలమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించినారు మరియు పాటశాలలో విద్యార్థులకు ప్లేట్ల పంపిణి చేయనైనది.ఇట్టి కార్యక్రమము లో యం.పి.ఓ ప్రకాష్ ,ఎ పి ఓ శ్వేత ,మిషన్ భగీరథ ఎ ఈ ఈ దివ్యశ్రీ ,హౌసింగ్ ఎ ఈ రియజుద్దిన్ ,వ్యవసాయ అధికారి హరిప్రసాద్, పంచాయతి కార్యదర్శి రాధా, సర్పంచ్ సుభాష్ నాయక్ మరియు పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పాతర్లపాడు గ్రామం లో కొత్త పెన్షన్ లబ్ధిదారులకు పత్రాలు అందజేత



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.పాతర్లపాడు గ్రామంలో కొత్త పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను గ్రామ సర్పంచ్ ఓబీనబోయిన లక్ష్మి అచ్చయ్య అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దారెల్లి సురేష్ , గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్ గారు, వార్డ్ మెంబర్లు, గ్రామ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

భద్రాచలంలో ర్యాపిడో సేవలు ప్రారంభం

ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,నవంబర్ 27,ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ప్రజలకు మరో ఆధునిక రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ బైక్ ట్యాక్సీ సంస్థ ర్యాపిడో తన సేవలను భద్రాచలంలో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు ర్యాపిడో సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భద్రాచలంలో ర్యాపిడో సేవలు అందుబాటులోకి రావడం భక్తులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్య ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. తక్కువ ఖర్చుతో వేగవంతమైన ప్రయాణ సౌకర్యం కల్పించడంలో ఈ సేవలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని, ఈ సేవల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు స్వయం ఉపాధికి మార్గం ఏర్పడుతుందని తెలిపారు. భద్రాచలం అభివృద్ధిలో ఇలాంటి ఆధునిక సేవలు కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ర్యాపిడో నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, స్థానిక యువకులు, రైడర్లు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1 జైల్ భరో జయప్రదం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి,, యంగల
మధిర బోనకల్ నవంబరు 27(సికె న్యూస్)

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ ఒకటో తేదీన ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు జైలు బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు

ది 27, 11, 2026 శుక్రవారం కలకోట గ్రామంలో 2027 పార్టీ సభ్యత్వాన్ని నమోదు కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాల అవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ మేరకు కూడా ముందుకు సాగలేదని 6 గ్యారంటీలు అమలు ఊసే లేదని రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఇవ్వాలని పేదలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అర్హులైన వారందరికీ పెన్షన్ ఇవ్వాలని, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించి ఈ యొక్క పథకాన్ని కొనసాగించాలి



నిత్యవసర వస్తువుల ధరలు అదుపు చేసి 12 రకాల వస్తువులు రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు అందించాలని పై డిమాండ్ల సాధనకు డిసెంబర్ 1న జరుగు కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు సన్నద్ధమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తూ విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి వెంగళ పెద్ద రమేష్ మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు బలుగూరి అచ్చయ్య గ్రామ నాయకులు బలుగూరి కిషోర్, బలుగూరి జయరావు , అక్కమ్మ, రాకేష్, రాజురత్నం తదితరులు పాల్గొన్నారు

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నవంబర్ (27) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.

కనీస వేతనం రూ.26,000 చెల్లించాలి (టీ యు సి సి) డిమాండ్,మనూర్ ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా సంగారెడ్డి జిల్లా మనూర్ మండల ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీ యు సి సి (ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా టీ యు సి సి జిల్లా నాయకులు చిరంజీవి మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, కాస్మోటిక్ వస్తువులు అందించాలని, ప్రతి కార్మికుడికి గ్రామపంచాయతీ గుర్తింపు ఐడీ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.
కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మనూర్ ఎంపీడీవో చంద్రశేఖర్ గారికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో దయాకర్, సయ్యద్, మైపాల్, ప్రమోద్, బాలయ్య, నర్సింలు, మాణిక్య తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపురం గ్రామంలో ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభం.



మధిరనవంబర్ 27(సికె న్యూస్)

మధిర మండలం ఖాజీపురం గ్రామంలో ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభోత్సవంలో భాగంగా, ఆన్లైన్ నమోదు కార్యక్రమాన్ని సర్పంచ్ శ్రీమతి ఆయేషా కమాల్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరు గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి అందించి గ్రామ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడడమే తమ లక్ష్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ వెంకటేశ్వర్లు , మండల కాంగ్రెస్ అధ్యక్షులు పారుపల్లి విజయ్ , జిల్లా అధికార ప్రతినిధి కర్ణాటి రామారావు , వెంకటాపురం సర్పంచ్ హరినాథ్ , కాంగ్రెస్ నాయకులు జాకీర్ గారు, గ్రామ సెక్రెటరీ అర్చన , గ్రామ ఉపసర్పంచ్ అక్మల్ ,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు ఫయాజ్ , మహమ్మద్ ఖాన్ ,షాహిద్ గారు, ఖాజా ,సైదు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

చేగుంటలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీలు,

- **కోచ్ గణేష్ రవికుమార్ వెల్లడి,**

సీ కే న్యూస్ చేగుంట : 28- 11- శనివారం నాడు చేగుంట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అండర్ 14, అండర్ 17,అండర్ 19 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శులు నాగరాజు,శ్రీనివాస్,భాస్కర్ రెడ్డి, సమ్మయ్య, గణపతి, కోచ్ కర్ణం గణేష్ రవికుమార్ ఒక సంయుక్త ప్రకటన తెలిపారు. ఈ పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, క్రీడాకారిణిలు తమ వెంట ఒరిజినల్ బోనాఫైడ్ సర్టిఫికెట్, పెన్ నెంబర్, ఆధార్ కార్డ్, బర్త్ సర్టిఫికేట్, ప్రీవియస్ ఇయర్ ప్రోగ్రెస్ కార్డు తమ వెంట తీసుకొని రావాలని వారు తెలిపారు. అండర్ 14 పోటీల్లో పాల్గొని క్రీడాకారులు 01-01- 2013 తర్వాత జన్మించిన వారై ఉండాలని, అండర్ 17 పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 01-01- 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలని, అండర్ 19 పోటీలలో పాల్గొనేవారు 01-01- 2008 తరువాత జన్మించిన వారై ఉండాలని వారు తెలిపారు. క్రీడాకారులు క్రీడాకారిణిలు ఎవరి భోజనం వారే తమ వెంట తీసుకురావాలని వారు కోరారు.ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు,క్రీడాకారిణిలు కరీంనగర్ జిల్లా రేకుర్తిలోని పాఠశాలలో డిసెంబర్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. పూర్తి వివరాలకు కోచ్ కరణం గణేష్ రవికుమార్, ప్రవీణ్ కుమార్ పీడీ 9666632023,9573296678,9440997788 నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

పైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్య



చిన్నారులకు ఉచితంగా యూనిఫామ్,షూలు,ఆట వస్తువుల పంపిణీ

మధిర నవంబర్ 27(సికె న్యూస్)ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సర్పంచ్ శ్రీనివాసరావు పిలుపు
మధిర ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రీ-ప్రైమరీ విద్యానంలో భాగంగా,మధిర మండలం దెందుకూరు ప్రాథమిక పాఠశాల చిన్నారులకు శుక్రవారం యూనిఫామ్,షూలు,ప్లేయింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు,ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం) డి.శ్యామలరావు కలిసి చిన్నారులకు వీటిని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ,ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన ప్రీ-ప్రైమరీ విద్యను అందిస్తూ,చిన్నారులకు అవసరమైన యూనిఫామ్,షూలు, ఆట వస్తువులను ప్రభుత్వం ఉచితంగా సమకూరుస్తోందని కొనియాడారు.తల్లిదండ్రులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాలఉపాధ్యాయులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.



సికె. న్యూస్.ఆదిలాబాద్

మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలి.
రౌడీ షీటర్లను, సస్పెక్ట్ షీటర్ లను తనిఖీ చేస్తూ ఉండాలి.
తాంసి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.
సైబర్ నేరాలపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశం.

శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తాంసి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పరిసరాలను, పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాలను, వివిధ రికార్డులు, కేసుల నిర్వహణ, మాల్ఖానా, స్టేషన్ పరిసరాలు, విధుల నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి విధులను పర్యవేక్షిస్తూ కోర్టు నందు నేరస్తులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తు కొనసాగాలని, ఎన్బి డబ్ల్యూ వారెంట్లను అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల్లో పోలీసులపై గౌరవం, విశ్వాసం పెరిగే విధంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు నిజాయితీతో, నిస్వార్థంగా సేవలందిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మండల పరిధిలో గంజాయి, గ్యాంబ్లింగ్, అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజల్లో చట్టాలపై, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, నేర కార్యకలాపాలపై సమాచారం సేకరిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోని అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. నేరాల నియంత్రణకు కృషి చేస్తూ ఉండాలని తెలిపారు. ఈ తనిఖీలో ఆదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, తాంసి ఎస్సైఓ ఇన్స్పెక్టర్ అంజమ్మ, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నైతిక విలువలు, ఉన్నత లక్ష్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు

యువత ఆత్మవిశ్వాసం, సమయపాలన, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి: కలెక్టర్ రాజర్షి షా



సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్:యువత కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, సమయపాలనతో కూడిన ఉన్నత వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు.శుక్రవారం ఆదిలాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' సంస్థ ఆధ్వర్యంలో 'యూత్ ట్రాన్స్‌ఫార్మేషన్ మిషన్'లో భాగంగా నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో యువత ఉన్నత స్థాయికి ఎదగాలంటే కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, విశ్లేషణాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు విలువైన సమయాన్ని వృథా చేయకుండా, చదువుతో పాటు తమలోని అంతర్గత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.జీవితంలో ఎదురయ్యే ఓటములు, సవాళ్లకు కుంగిపోకుండా వాటిని అనుభవాలుగా స్వీకరించి, సానుకూల దృక్పథంతో లక్ష్యం వైపు ముందుకు సాగాలన్నారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.'మనసులను ప్రేరేపిస్తూ.. ఆత్మలను ప్రజ్వలింపజేద్దాం' అనే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం యువతలో ఆత్మవిశ్వాసం, నూతన ఆలోచనలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులు, 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' ప్రతినిధుల కృషిని కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లలిత కుమారి, లేబర్ ఆఫీసర్ ముత్యం రెడ్డి, రంజిత్ సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణాపురం సమస్యలను నందిని విక్రమార్క దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ నాయకులు

- **రైతుల పొలాలకు దారి, ఆలయ అభివృద్ధి, డ్రైనేజీ సమస్యలు**



మధిర నవంబర్ 27(సికె న్యూస్)మధిర మండలం కృష్ణాపురం (మునగాల) గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామ నాయకులు శుక్రవారం మధిర క్యాంపు కార్యాలయంలో మల్లు నందిని విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు ఆధ్వర్యంలో నాయకులు గ్రామసమస్యలను వివరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..... గ్రామంలోని రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, గ్రామ సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన ప్రణాళిక రూపొందిస్తామని మల్లు నందిని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, గ్రామ సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కొత్తపల్లి నరసింహారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు పోచేపల్లి శంకర్రావు, కర్నాటి శ్రీనివాసరావు,పి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి గుడి వద్ద. యరమల నారాయణరెడ్డి, అలేఖ్యలను మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యుల శుభాకాంక్షలు



మధిర నవంబర్ 27(సికె న్యూస్)మధిర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి మరియు సభ్యులు ఆధ్వర్యంలో యరమల రామనారాయణరెడ్డి అలేఖ్య, పెళ్లి రోజు సందర్భంగా పెళ్లిరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు
ఈ సందర్భంగా పల్లపోతుల ప్రసాద్ జంగా శ్రీనివాస్ రెడ్డి, పెళ్లి రోజు సందర్భంగా సాంబశివరెడ్డి సరస్వతీ దంపతులు ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వంకాయలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు సద్ది ఏర్పాటు చేయడం వారి సహృదయానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు వారి కుమారుడి కోడలుకి స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా వారికి అయ్యప్ప స్వామి నిర్వాహకులు ధర్మారావు శ్రీనివాస రావు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేసినారుఈ కార్యక్రమంలో పాల్గొన్న స్విమ్మింగ్ సభ్యులు చల్లా సత్యనారాయణ, లింగంపల్లి, అప్పారావు, శీలం శ్రీనివాసరెడ్డి వంకాయలపాటి, నాగేశ్వరరావు, పసుపులేటి నాగేంద్ర శ్రీనివాస్ రావు, షేక్ జానీ, కొత్తూరు నరసింహారావు, చలువాది వరుణ్, కోలా ప్రసాద్, ఒట్టే సైదులు లింగాల శ్రీనివాస్, సాధినేని సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఒకే సవరణ ప్రక్రియలో పదేపదే దరఖాస్తులు చేయరాదు

- ఓటరు కార్డులో మార్పులకు ఒకేసారి దరఖాస్తు చేసుకోవాలి
- అప్పీల్‌పై విచారణ నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా



సికె.న్యూస్. ప్రతినిధి. ఆదిలాబాద్:ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఓటరు గుర్తింపు కార్డు (జూ×జ)లో మార్పులు చేసుకోవాలనుకునే వారు సంబంధిత నిబంధనల ప్రకారం ఒకేసారి దరఖాస్తు చేసుకోవాలని, ఒకే సవరణ ప్రక్రియలో పదేపదే దరఖాస్తులు సమర్పించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు.గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అప్పీల్‌పై ఆయన విచారణ నిర్వహించారు.మావల మండలం కైలాష్‌నగర్‌కు చెందిన గుండ్లవార్ శేఖర్ తన ఓటరు గుర్తింపు కార్డులో ఇంటిపేరును 'గుండ్ల' నుంచి 'గుండ్లవార్'గా మార్చాలని కోరుతూ 04.07.2026న ఫారం-8 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఎన్నికల నమోదు అధికారి (జు=ా) 18.09.2026న ఆమోదించారు.అనంతరం తన తండ్రి పేరును 'గుండ్ల చంద్రకాంత్' నుంచి 'గుండ్లవార్ చంద్రకాంత్'గా సవరించాలని కోరుతూ 05.10.2026న మరోసారి ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, విచారణ అనంతరం ఈ దరఖాస్తును జు=ా 26.11.2026న తిరస్కరించారు.దీంతో దరఖాస్తు తిరస్కరణకు గల కారణాలను తెలియజేయాలని కోరుతూ శేఖర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకున్నారు. దీనిపై విచారణ చేపట్టిన కలెక్టర్ సంబంధిత వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు, ఇంటిపేరు, ఇతర వివరాల్లో మార్పులు అవసరమైనప్పుడు నిబంధనల ప్రకారం సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకే సవరణ ప్రక్రియలో పదేపదే దరఖాస్తులు చేయకుండా, నిర్ణీత విధానాన్ని అనుసరించాలని తెలిపారు.డిసెంబర్ 22, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించిన అనంతరం సంబంధిత అంశంపై ఎన్నికల నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎన్నికల నమోదు అధికారిని ఆదేశించారు.ఈ విచారణలో ఆర్డీవో జగదీశ్వర్ రావు, మావల తహశీల్దార్ వేణు, ఎన్నికల పర్యవేక్షణ అధికారి నలంద ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు,

- బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సువర్ణ సురేష్ చారి -- నిఖిల దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



సీ కే న్యూస్ చేగుంట :(మాసాయిపేట) మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సువర్ణ సురేష్ చారి, నిఖిల దంపతులకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆశీర్వాదాలు అందజేశారు.ఈ సందర్భంగా నూతన దంపతులను ఆప్యాయంగా పలకరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు. దంపతులు పరస్పర అవగాహన, ప్రేమాభిమానాలతో జీవితంలో ముందుకు సాగాలని ఆశీర్వదించారు.గ్రామ అధ్యక్షుడి కుటుంబ శుభకార్యానికి ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలతో పాటు చేగుంట మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జెడ్పిటిసి ముధం శ్రీనివాస్ , చెట్ల తిమ్మాయిపల్లి సర్పంచ్ హంషి మనోహర్ , మాసాయిపేట మాజీ సర్పంచ్ చిట్టి మిల్ల నాగరాజు , సీనియర్ నాయకులు కొంగోటి యాదిరెడ్డి , టిఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ , పలువురు రాజకీయ నాయకులు , మాజీ ఎంపీటీసీ హోళియా నాయక్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు

బోనాల కొండాపూర్‌లో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం పట్టాల పంపిణీ,దుబ్బాక ఎమ్మెల్యే,



సీ కే న్యూస్ / చేగుంట :చేగుంట మండలం బోనాల కొండాపూర్ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ, డిప్యూటీ ఈఈ, ఎమ్మార్వో తో పాటు సంబంధిత అధికారులు పాల్గొని లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు పట్టాలు అందడంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

ప్రజలకు మెరుగైన సేవలే మీ-సేవ కేంద్రాల లక్ష్యం

మసూద్ చౌక్‌లో నూతన మీ-సేవ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా



సికె.న్యూస్. ప్రతినిధి. ఆదిలాబాదు:జిల్లాలో ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన పౌర సేవలను అందించడమే లక్ష్యంగా గ్రామాలు, మండలాల స్థాయిలో కొత్త మీ-సేవ కేంద్రాల కేటాయింపు ప్రక్రియను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మసూద్ చౌక్‌లో సైఫ్ అహ్మద్ మసూద్‌కు మంజూరైన నూతన మీ-సేవ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత కొద్ది నెలలుగా జిల్లాలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి కొత్త మీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సైఫ్ అహ్మద్ దివ్యాంగుడు కావడంతో పాటు గతంలో మీ-సేవ కేంద్రంలో పనిచేసిన అనుభవం, జెరాక్స్ దుకాణం నిర్వహిస్తున్న నేపథ్యం ఉండటంతో ఈ కేంద్రానికి పూర్తి అర్హత కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు కేంద్రం కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, తక్షణమే ఆమోదం లభించిందని, నవంబరు 9న మీ-సేవ ఐడీ సైతం మంజూరైందని వివరించారు. మసూద్ చౌక్‌లో మీ-సేవ కేంద్రం అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు ఎన్నో కీలక సేవలు అందుతున్నాయని, వివిధ ధ్రువపత్రాల జారీ, భూభారతి సంబంధిత అంశాలు, ఆలస్యంగా నమోదయ్యే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పట్టణ ప్రణాళిక వంటి అనేక సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని సూచించారు. ఈ కేంద్రం ద్వారా స్థానికులకు మెరుగైన సేవలు అందిస్తూ, మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని మీ-సేవ కేంద్రాల పనితీరుపై ఈడీఎం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారని, ఎక్కడైనా లోపాలు లేదా అవకతవకలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు సైఫ్ అహ్మద్ మసూద్, కుటుంబ సభ్యులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనతోనే పాలనా వ్యవస్థపై సమగ్ర అవగాహన

ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, సమర్థవంతమైన సేవలందించాలి -- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సికె.న్యూస్. ప్రతినిధి. ఆదిలాబాద్:క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల జీవన పరిస్థితులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, వివిధ శాఖల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా పాలనా వ్యవస్థపై సమగ్ర అవగాహన ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.2026 ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్ కోర్సులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించిన ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులకు నిర్వహించిన క్షేత్రస్థాయి శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లాలో శిక్షణ పొందిన ట్రైనీ అధికారులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేపట్టిన క్షేత్రస్థాయి పర్యటనల అనుభవాలను, ఆయా ప్రాంతాల్లో గమనించిన పరిస్థితులను, ప్రజల నుంచి తెలుసుకున్న అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించారు. విద్య, వైద్యం, ఉపాధి, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, ఐసీడీఎస్ సేవలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఏ మేరకు చేరుతున్నాయి.. వాటి అమలులో ఎదురవుతున్న సమస్యలు ఏమిటి.. అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం అధికారులకు ఎంతో అవసరమన్నారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో నేరుగా మాట్లాడటం ద్వారా క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు.పరిపాలన అనేది కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో, సమర్థవంతంగా అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. శిక్షణలో పొందిన అనుభవాలు, క్షేత్రస్థాయిలో నేర్చుకున్న అంశాలు భవిష్యత్తులో విధుల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయి శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులను కలెక్టర్ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ రవీందర్ రాథోడ్, జెడ్పీ సీఈఓ రవి, డీపీఓ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజలింగు, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.28 లక్షలు.. కలెక్టర్‌కు కృతజ్ఞతలు



సికె.న్యూస్. ప్రతినిధి అదిలాబాద్:కేఆర్‌కే కాలనీ తెలుగు మాధ్యమ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి రూ.28 లక్షలు మంజూరు కావడానికి సహకరించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో పాఠశాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పాఠశాలలో మూడు ప్యానల్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, తరగతి గది, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపడి, విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుందని యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నవీన్ యాదవ్, సైరి శ్రీకాంత్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కనక అభిమన్, ప్రశాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

డిగ్నూర్ గ్రామానికి మహర్దశ -- ఎంపీ గోడం నగేష్‌కు గ్రామస్థుల ఘన సన్మానం



సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్:ఆదిలాబాద్: పాత జాతీయ రహదారి నంబర్ 7 (చీ౯-7)పై ఇచ్చోడ నుంచి దేద్రా వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో, బజార్ హత్నూర్ మండలం డిగ్నూర్ గ్రామానికి చెందిన సర్పంచ్, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ మరియు గ్రామ ప్రజలు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ గారిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డిగ్నూర్ గ్రామానికి డబుల్ రోడ్డు మంజూరు చేయించడంలో విశేష కృషి చేసిన ఎంపీ గోడం నగేష్ గారికి గ్రామ సర్పంచ్, గ్రామస్థులు శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎంపీ గోడం నగేష్ గారు రహదారి నిర్మాణ పనుల పురోగతిని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయి, నిర్మాణ సమయంలో గ్రామ ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలపై గ్రామస్థులతో చర్చించారు.ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ గారు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో రహదారులు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని, ఇచ్చోడ నుంచి దేద్రా వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ ననాం రమణ, డిగ్నూర్ గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు!

పోలీసుల తీరుపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆగ్రహం

గద్వాల: పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, వారిపై కఠినంగా జరిమానాలు విధిస్తున్న పోలీస్ శాఖ తీరుపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రజల కష్టాలను, ముఖ్యంగా పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని పోలీసులు విధులు నిర్వహించాలని సూచించారు.చట్టాన్ని అమలు చేసే క్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పేద ప్రజల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజల సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు.ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ వ్యవస్థ ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా, చట్ట పరిధిలోనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పేద ప్రజల సమస్యలపై స్పందిస్తూ, వారి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వ్యాఖ్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

భీంపురంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం

అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా కృషి చేస్తాం: సర్పంచ్ ఘలా రఘు



ధరూర్, నవంబర్ 28:జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని భీంపురం గ్రామంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభమైంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఘలా రఘు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఘలా రఘు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఆపద సమయంలో కుటుంబాలకు అండగా నిలిచేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఇలాంటి పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా అర్హులైన కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పథకంలో భాగస్వాములు కావాలని తెలిపారు.గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు గ్రామంలో నూతనంగా మంజూరైన వృద్ధాప్య వితంతు పింఛన్ పత్రాలును

అందజేసిన సర్పంచ్ మొగిలి కృష్ణయ్య.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.ప్రొద్దుటూరు గ్రామ సర్పంచ్ శ్రీ మొగిలి కృష్ణయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పించన్ మంజూరు పత్రాలను అందజేస్తున్న దృశ్యం ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీమతి రజియా గ్రామ ఉప సర్పంచ్ శ్రీమతి గుర్రం చిట్టి మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్య వార్డ్ మెంబర్ గొర్రె ముచ్చు జాన్ గ్రామస్తులు నల్లమోతు రాంబాబు చేబ్రోలు రమేష్ నాగనబోయిన సాయికుమార్ మరియు పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు

కొత్తగూడ మండల వార్తకా వ్యాపార సంగం నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు సన్మానం





ఈరోజు కొత్తగూడ మండల కేంద్రంలో ఓం శ్రీ ముసలమ్మా అగ్రి యూనియన్ ఆధ్వర్యంలో వార్తకా వ్యాపార సంఘమ్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు జంగాల వినయ్ గుప్త (ఓం శ్రీ ముసలమ్మా సీడ్స్)ఉపాధ్యక్షులు బండి రాజమౌళి (లక్ష్మి దుర్గ సీడ్స్) కొత్తగూడ గారికి వారు ఘనంగా శాలువాతో సన్మానం చేయడం జరిగింది..
యూనియన్ మండల అధ్యక్షులు లెంకలపల్లి శ్రీను యాదవ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించి సేవ చేసిన వారు ఇప్పుడు కొత్తగూడ అన్ని రకాల వ్యాపారుల సమస్యలుతెలుసుకొని పరిసష్కరించి.. చిరు వ్యాపారులను ప్రోత్సాహించాలనీ కోరుకుంటూ వీరి ఎన్నిక పట్ల సంతోషాన్ని వ్యక్తపరిచారు ఈ కార్యక్రమం లొ యూనియన్ గౌరవ అడధ్యక్షులు బిరుదు రాజేష్, దాసరి రాజకుమార్, చ్చేన్నుటి మహహేందర్, మామిడిశెట్టి సురేష్, రాజకుమార్, దేవేందర్, భాస్కర్, రాజకుమార్, మురళి, తదితరులు పాల్గొన్నారు

అయ్యప్ప మహా పడిపూజ,ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు,ప్రజా ప్రతినిధులు,



సీ కే న్యూస్ చేగుంట :చేగుంట మండలం బోనాల కొండాపూర్ గ్రామంలో సర్పంచ్ రంగయ్య, రామకృష్ణారెడ్డి, రాజిరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. మహా పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

కుటుంబానికి ఆర్థిక భరోసా ఇందిరమ్మ బీమా పథకం... సర్పంచ్ పర్చ రామచంద్ర రావు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండలం మండలం లోని చిన్నమండవ గ్రామం రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ' ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' నమోదు ప్రక్రియ చిన్నమండవ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా ప్రారంభమైంది...ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ పర్చ రామచంద్రరావు మాట్లాడుతూ, కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని విధంగా మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరించి అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా రక్షణ కల్పిస్తోందని వివరించారు.గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మకుండా నేరుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తంగిరాల మాధవి పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ వార్డ్ మెంబర్ గుండ్ల అనిల్ కుమార్ పలువురు లబ్ధిదారుల పాల్గొని ఇందిరమ్మ బీమా పథకానికి నమోదు చేయించుకున్నారు...

ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షకు అభ్యర్థులకు పలు సూచనలు.

జిల్లా కేంద్రం నందు 28 సెంటర్లలో 10,104 విద్యార్థులకు పరీక్ష.

సమయానికంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరు.

ఎలక్ట్రానిక్ పరికరాలకు, వాచ్ లకు, క్యాలిక్యులేటర్లకు అనుమతి లేదు.

బస్టాండ్ మరియు కలెక్టర్ చౌరస్తానందు రెండు ట్రాఫిక్ హెల్ప్ డెస్క్ ల ఏర్పాటు.

పరీక్ష కేంద్రాల వద్ద 200 మీటర్ల వరకు 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) అమలు

పట్టణానికి దూరంగా ఉన్న తొమ్మిది పరీక్షా కేంద్రాల అభ్యర్థులు త్వరగా బయలుదేరితే ఉత్తమం

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్

సికె.న్యూస్ ప్రతినిధి.అదిలాబాద్ :వచ్చే ఆదివారం నవంబర్ 29 న ఆదిలాబాద్ పట్టణంలో జరిగే ఎస్ఐ ప్రాథమిక పరీక్షకు జిల్లా కేంద్రానికి విచ్చేసే అభ్యర్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పట్టిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రం నందు ఎస్సై ప్రిలిమినరీ రాత పరీక్ష కోసం 28 పరీక్షా కేంద్రాలలో 10,104 మంది విద్యార్థులు రాత పరీక్షను రాయనున్నారు. దీనికి సంబంధించిన పరీక్ష వ్యవహారాలను జెఎన్టియు నిర్వహిస్తుందని పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పోలీసు వ్యవస్థ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ 28 కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉంటుందని, 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్స్, ఇంటర్నెట్ సెంటర్స్ మూసివేయ బడతాయని, విద్యార్థులు ఎటువంటి భయాందోళనలు లేకుండా పరీక్షను విజయవంతంగా రాయాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ బందోబస్తు ప్రక్రియ అడిషనల్ ఎస్పీ పి మౌనిక ఐపిఎస్ పోలీస్ నోడల్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు.

కింద తెలియజేసిన 9 పరీక్ష కేంద్రాల అభ్యర్థులు త్వరగా చేరుకోవాలని సూచన. వాటిలో బస్టాండ్ నుండి ఒకలే, ఆర్యభట్ట, ఎస్సార్ ప్రైమ్, ఎస్సార్ జూనియర్, సేక్రేడ్ హార్ట్ కాన్వెంట్ స్కూల్ కేంద్రాలకు 8:30 మరియు 9 గంటల సమయంలో బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగింది.

1. ఒకలే ఇంటర్నేషనల్ స్కూల్, చందా.
2. ఆర్యభట్ట హైస్కూల్, భీమ్సరి గ్రామం.
3. అభ్యుదయ హై స్కూల్, పిప్పర్వాడ టోల్ ప్లాజా.
4. ఎస్ ఆర్ ప్రైమ్ స్కూల్, మావల.
5. ఎస్సార్ జూనియర్ కాలేజ్, మావల.
6. వివేకనంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, దుర్గా నగర్.
7. రేసోనన్స్ వరల్డ్ స్కూల్, దుర్గా నగర్.
8. సేక్రేడ్ హార్ట్ కాన్వెంట్ హై స్కూల్, రాంపూర్ గ్రామం.
9. గవర్నమెంట్ హై స్కూల్, మహాలక్ష్మి వాడ.

పట్టణానికి దూరంగా ఉన్న ఈ కేంద్రాల అభ్యర్థులు త్వరగా బయలుదేరి పరీక్షా కేంద్రాలకు సరైన సమయంలో చేరుకోవాలని సూచించారు.

ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక సీఐ స్థాయి అధికారి ఇన్చార్జిగా ఉంటారని తెలిపారు. రూట్ మరియు సెక్టర్స్ స్థాయిలను డిఎస్పీ అధికారులు పర్యవేక్షిస్తుంటారు తెలిపారు. విద్యార్థులు తమ వెంట పెన్ను, హాల్టికెట్, ఫోటో తప్ప ఎటువంటి వస్తువులను, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావద్దని సూచించారు. తప్పకుండా హాల్ టికెట్ వెనకాల పొందుపరిచిన నియమాలను ప్రతి ఒక్క విద్యార్థి పాటించాలని తెలిపారు.

అభ్యర్థులకు సూచనలు

ూూ=దీ ద్వారా నిర్వహించే ఎస్ఐ ప్రాథమిక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ముఖ్యమైన సూచనలు

పరీక్ష వేళలు: ఉదయం 10:00 నుండి మద్యాహ్నం 1:00 గం"ల వరకు నిర్వహించబడుతుంది. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 9:00 గం"ల వరకు చేరుకోవాలి.

1. హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫోటో, సంతకం స్పష్టంగా ఉండాలి. ూ4 పేపర్‌పై రెండు వైపులా ప్రింట్ తీసుకోవాలి. పాస్‌పోర్ట్ సైజు ఫోటోను నిర్దేశించిన స్థలంలో అతికించాలి.
2. పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందుగా పరీక్షా హాలులోకి అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్ష పూర్తయ్యే వరకు బయటకు వెళ్లడానికి అనుమతి లేదు.
3. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, బ్లూటూత్ పరికరాలు, టాబ్లెట్లు, కాలిక్యులేటర్లు, ఇయర్ పరికరాలు, నోట్స్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా నిషేధం.
4. మహిళా అభ్యర్థులు భారీ బంగారు ఆభరణాలు, హ్యాండ్‌బ్యాగులు, పర్సులు తీసుకురాకూడదు. పరీక్షా కేంద్రంలో వస్తువులు భద్రపరిచే సదుపాయం ఉండదు.
5. పరీక్షా హాలులోకి హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు మాత్రమే తీసుకెళ్లాలి. ఇతర రంగుల పెన్నులు, పెన్సిళ్లు, జెల్ పెన్నులు అనుమతించరు.
6. అభ్యర్థుల ఫోటో, వేలిముద్రలు, బయోమెట్రిక్స్, సంతకం సేకరించడంతో పాటు ఆధార్ ఫేషియల్ అథెంటికేషన్ నిర్వహిస్తారు. వేళ్లపై మెహందీ, టాటూలు లేదా బయోమెట్రిక్స్‌కు ఆటంకం కలిగించే పదార్థాలు ఉండకూడదు.
7. ప్రిలిమినరీ రాత పరీక్ష 200 మార్కులకు, 200 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రశ్నపత్రంలో అన్ని 200 ప్రశ్నలు, పేజీలు ఉన్నాయో లేదో పరిశీలించాలి.
8. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కులు ఉంటాయి. కాబట్టి సమాధానాలు గుర్తించేటప్పుడు జాగ్రత్త వహించాలి.
9. ూవీ= షీట్‌పై వైట్ ఫ్లూయిడ్ లేదా ఎరేజర్ ఉపయోగించకూడదు. సమాధానాలను మార్చడానికి ప్రయత్నిస్తే ూవీ= షీట్ చెల్లకుండా పోయే అవకాశం ఉంది.
10. పరీక్ష పూర్తయిన తర్వాత ూవీ= ఆన్సర్ షీట్‌ను తప్పనిసరిగా ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. ూవీ= షీట్ ఇవ్వకుండా వెళ్లడం నేరపూరిత చర్యలకు, అభ్యర్థిత్వం రద్దుకు దారితీస్తుంది.
11. పరీక్షా సమయంలో ఇతర అభ్యర్థులతో మాట్లాడటం, చర్చించడం, సమాధానాలు తెలుసుకోవడం లేదా ఎలాంటి అవకతవకలకు పాల్పడటం నిషేధం. నిబంధనలు ఉల్లంఘిస్తే అభ్యర్థిత్వం రద్దుతో పాటు భవిష్యత్తులో పరీక్షలు రాయకుండా నిషేధించే అవకాశం ఉంది.
12. ప్రశ్నపత్రం ఇంగ్లీష్-తెలుగు, ఇంగ్లీష్-ఉర్దూ భాషల్లో ఉంటుంది. అనువాదంలో ఏదైనా తప్పు లేదా సందిగ్ధత ఉంటే ఇంగ్లీష్ ప్రశ్ననే ప్రామాణికంగా పరిగణిస్తారు. పరీక్ష పూర్తయిన తర్వాత ప్రశ్నపత్రాన్ని అభ్యర్థులు తమ వెంట తీసుకెళ్లవచ్చు.
13. పరీక్ష ముగిసిన తర్వాత ఇన్విజిలేటర్ ూవీ= షీట్లన్నింటినీ సేకరించి కవరులో భద్రపరిచే వరకు అభ్యర్థులు హాల్ నుంచి బయటకు వెళ్లకూడదు. అందరూ ఒకేసారి బయటకు వెళ్లాలి.
14. అభ్యర్థులు, పరీక్ష విధి నిర్వాహణలో ఉన్నవారు తప్ప ఎవరూ పరీక్ష మెయిన్ గేట్ దాటి లోపలికి అనుమతించబడరు

ముఖ్య గమనిక: అభ్యర్థులు పరీక్షకు ముందుగానే కేంద్రానికి చేరుకుని, హాల్ టికెట్‌తో పాటు అవసరమైన పెన్ను మాత్రమే తీసుకెళ్లాలి. అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.



రేపల్లెవాడలో కొత్త పింఛన్ల గుర్తింపు పత్రాలను అందజేసిన

సర్పంచ్ మడిపల్లి అంబిక.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని,:మండలంలో రేపల్లెవాడ గ్రామంలో కొత్తగా మంజూరైన ఆసరా పింఛన్ల గుర్తింపు పత్రాలను సర్పంచ్ మడిపల్లి అంబిక అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో అర్హత కలిగిన వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతో పాటు కల్లుగీత కార్మికులకు కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పింఛన్లతో నిరుపేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ బంధం కృష్ణ పంచాయతీ కార్యదర్శి కే రామారావు యూత్ నాయకులు మడిపల్లి రాంప్రసాద్ కొత్తగా పింఛన్లు పొందిన లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.ు

గద్వాల డీటీవో కార్యాలయం ఎదుట లారీ యజమానుల, లారీ డ్రైవర్లు, నిరసన మద్దతు తెలిపిన ఎమ్మెల్యే

ఆర్టీవో అధికారిపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆగ్రహం...

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో రవాణా శాఖ (డీటీవో) కార్యాలయం ఎదుట లారీ అసోసియేషన్ సభ్యులు ఆందోళనకు దిగారు. తమ లారీలను కార్యాలయం ముందు నిలిపివేసి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు.
లారీలకు ట్యాక్స్ గడువు ముగిసిందన్న కారణంతో రవాణా శాఖ అధికారులు భారీగా చలాన్లు విధిస్తుండటం, అధిక వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో లారీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయం తెలుసుకున్న వెంటనే లిగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్వయంగా వెళ్లి ఆర్టీవో కార్యాలయానికి చేరుకుని లారీ యజమానులకు మద్దతుగా నిలిచారు. ఆర్టీవో అధికారులతో మాట్లాడడం జరిగింది.
రవాణా శాఖ మంత్రి తో కూడా ఎమ్మెల్యే మాట్లాడడం జరిగింది ..
ఎమ్మెల్యే మాట్లాడుతూ .... గద్వాల నియోజకవర్గ ప్రాంతంలో వాహనదారుల్లో పేదవారు ఉంటారని, వారి పరిస్థితిని అర్థం చేసుకుని జరిమానాలు విధించాలని అధికారులకు సూచించారు. ప్రతి విషయానికి కఠినంగా చట్టం ప్రకారం కాకుండా, కొన్నిసార్లు చూసీచూడనట్లు వ్యవహరించాలని ఇన్‌ఛార్జ్ డీటీవోకు విన్నవించారు.
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక నిబంధన ఉంటే, గద్వాలలో మాత్రం మరో రకంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఇన్‌ఛార్జ్ డీటీవోపై మండిపడ్డారు.రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను ఆపి ఇష్టారాజ్యంగా ఫైన్లు వేయడంపై వాహనదారులు అధికారి దృష్టికి తీసుకెళ్లి చర్చించారు.
గద్వాల ప్రాంతంలో ఇండస్ట్రీటి ఏరియా కాదు పెద్ద పెద్ద పరిశ్రమలు ఇక్కడ లేవు కేవలం గద్వాల ప్రాంతంలో దాదాపుగా 80% వ్యవసాయ రంగంపై ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారు. రంగం సంబంధించిన వరి, పత్తి వేరుశనగను, గద్వాల ప్రాంతం నుండి కర్ణాటక కు రవాణా ట్రాన్స్పోర్ట్ తీసుకోవాలని జరుగుతుంది దానికి ఇబ్బంది లేకుండా సామాన్య ప్రజలకు రైతులకు ఇబ్బంది కలవకుండా విధులు నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలి వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేలాగా చూడాలని సూచించారు. ఆర్టీవో అధికారులు స్థానికులంగా స్పందించి వాన దారులకు, లారీడైవర్ అసోసియేషన్ సభ్యులు లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసే విధంగా ఏదైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి వెంటనే వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని భరోసా తీయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.
అధికారులతో వాహనదారులు, లారీ డ్రైవర్లు అసోసియేషన్ సభ్యులు సమన్వయంతో ఉండాలని సూచించారు . ఎమ్మెల్యే వెంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ & కౌన్సిలర్ బాబర్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సతీష్, నాయకులు ఉరుకుందు, మైలగడ్డ చంద్రశేఖర్, నారాయణరెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ యూసూఫ్ ఖాద్రీ పద్ధతులు మార్చుకోవాలి



ముస్లిం ప్రజలలో మోసపూరిత ప్రచారాలకు పాల్పడి, గందరగోళానికి గురిచేసే చర్యలు తగవు

జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ

సి కె న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :కీసర సర్కిల్, జీహెచ్ఎంసీ, బాలాజీనగర్, వికలాంగుల కాలనీలో ఉన్న నయా ఈద్గా విషయంలో కమిటి నుండి వెలివేయబడిన మహ్మద్ యూసూఫ్ ఖాద్రీ అనే వ్యక్తి కుక్క తోక వంకర అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మరియు పురాణ, నయా ఈద్గా కమిటీలకు చెందిన ముఖ్యుల సమావేశంలో ఆ కమిటీలకు చెందిన నేతలు గుర్తుచేశారు. 2026, నవంబర్-27, శుక్రవారం రోజున జరిగిన అత్యవసర సమావేశం మోహన్ రావు కాలనీ, పురాణ ఈద్గాలో జరిగింది. కమిటీల సహనాన్ని రెచ్చగొట్టేల వికలాంగుల కాలనీ, సిటిజన్ కాలనీలో ఉన్న మజీద్ ల ఇమామ్ లకు గురువారం రోజు తన అనుచరుడైన అక్తార్ అనే ఆటో డ్రైవర్ చేత కోర్టు ఉత్తర్వుల పేరిట ముస్లిం ప్రజలలో మోస పూరితమైన తప్పుడు కాగితాలు, తప్పుడు ప్రచారలతో గందరగోళం సృష్టించాలన్న దుర్మార్గమైన ఆలోచన పద్ధతులు, అనైతిక చర్యలు యూసూఫ్ ఖాద్రీ వెంటనే మానుకోవాలని సూచించారు. లేనియేడల భవిష్యత్తులో తిరిగి ఇలాంటివే పునరావృతం అయితే లీగల్ గా వెళ్ళాల్సి ఉంటుందని కమిటీల నాయకులు హెచ్చరించారు. నయా ఈద్గా(స్మశానవాటిక)ను అతని స్వార్థపర అవసరాలకు తన వ్యక్తిగత ఆస్థికింద జమకట్టి మట్టి, గుట్ట రాళ్ళ అక్రమ దందాలకు పాల్పడి, ఇష్టానుసారంగా వ్యవహారించడం వలనే ఆయనపై స్థానిక పోలీసు స్టేషన్ లో కేసులు కూడ నమోదు అయ్యాయని అన్నారు. బెయిల్ పై భయట తిరుగుతూ కూడ, నేటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పులు రాలేదని, పైగా అవి మరింత పెరిగి, కమిటీలకు చెందిన కొందరిపై కక్షను పెంచుకొన్నారని అన్నారు. జవహర్ నగర్ కు వలస వచ్చిన కొందరి బీహార్ కు చెందిన ముస్లిం యువకుల చేత గొడవలు, ఘర్షణలకు పలుమార్లు ఉసిగొల్పారని తెలియజేశారు. రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంలో జరిగే ప్రార్థనలలో అల్లర్లు రేపడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం, శాంతి కోసం కమిటీలు పాడుతున్నాయని, వాటిని విఘాత పరిచేలా చేయడం తగదని అన్నారు. అందులో బాగంగా యూసూఫ్ ఖాద్రీ ఎన్ని అరాచక చర్యలకు పాల్పడిన సహనాన్ని ప్రదర్శిస్తూ, ఆయనలో పరివర్తన కోసం వేచి చూస్తున్నామని గుర్తుచేశారు. తప్పులు, పొరపాట్లు చేయడం మనిషి సహజ లక్షణం అని, వాటిని గుర్తించి, సరిచేసుకొనే వ్యక్తులే సమాజ ఉన్నతికి పాటుపడుతారని అన్నారు. ఇప్పటికైన కొత్తకమిటీ, పాతకమిటీ, కోర్టు ఉత్తర్వుల పేరుతో వ్యక్తిగత కక్షలు, ఈర్ష్య, ద్వేషాలు విడనాడి, తన తప్పిదాలు తెలుసుకొని మనిషిలో ఉన్న మంచి తనాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. షైతాన్ వ్యవహారాలకు పాల్పపడి శ్రేయోభిలాషులు, మిత్రులను దూరం చేసుకోవద్దని గుర్తుచేశారు. దీనిపై సంభందిత పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయబోతునట్లు పేర్కొన్నారు.
ఈపై కార్యక్రమంలో జవహర్ నగర్ ముస్లిం సంక్షేమ సంఘం కమిటీ అధ్యక్షుడు పాషా మియా, టి. కలేషా, షేక్ .అహ్మద్, సయ్యద్. ముబషీర్,మొహమ్మద్ వహీద్, షేక్. అఫ్జల్, మహ్మద్. షఫీ, మహ్మద్. మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా వ్యవహరించిన వ్యక్తిపై కేసు నమోదు -- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు.

- ఇతర మతాన్ని కించపరిచేలా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వీడియో పోస్టు చేసిన నిందితుడు.
- వాట్సాప్ గ్రూపులో అభ్యంతరకర వీడియో పోస్టు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసిన గుడిహత్నూర్ పోలీసులు.
- ఇంస్టాగ్రామ్ నందు తల్వార్ లతో పోస్ట్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన నిందితుడు.
- ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్



సికె.న్యూస్.గుడిహత్నూర్:నిందితుడి వివరాలు:
రాథోడ్ అర్జున్ (20), ఒ/శి వినోద్, నివాసం: కొల్హారి గ్రామం, గుడిహత్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా.
గుడిహత్నూర్ మండలంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా, ఒక మతాన్ని కించపరిచే విధంగా వాట్సాప్ గ్రూపులో అభ్యంతరకర వీడియోను పోస్టు చేసిన రాథోడ్ అర్జున్ (20) అనే వ్యక్తిని గుడిహత్నూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ నెల 26వ తేదీన 'మన గుడిహత్నూర్' అనే వాట్సాప్ గ్రూపులో మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్న వీడియోను నిందితుడు పోస్టు చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ వీడియోలో ఒక మతానికి చెందిన వారిని కించపరిచేలా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉండటంతో పాటు, రెండు మతాల మధ్య శత్రుత్వం, విద్వేషాలు పెంచే విధంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో గుడిహత్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో వీడియోను పోస్టు చేసిన వ్యక్తిని గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. ఇదే నిందితుడో ఇన్స్టాగ్రామ్ నందు తల్వార్ లతో పోస్టు ఉంచి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్ మాట్లాడుతూ, సోషల్ మీడియాను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఇతర మతాలు, వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సమాజంలో మత సామరస్యం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతరులు పంపిన అభ్యంతరకర పోస్టులను కూడా షేర్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కేసులో గుడిహత్నూర్ ఎస్ఐ ఎల్. శ్రీకాంత్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వేదికపై కర్రసాము

- ఖేలో ఇండియాలో తొలిసారి తెలంగాణ సంప్రదాయ యుద్ధ కళ
- తరతరాల క్రీడా వారసత్వానికి జాతీయ గుర్తింపు
- హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రత్యేక ప్రదర్శనలు
- ఐదు సంప్రదాయ క్రీడల్లో 39 ఈవెంట్లు



సికె.న్యూస్ ప్రతినిధి :చేతిలో వెదురు కర్ర.. కళ్లలో ఏకాగ్రత.. కదలికల్లో మెరుపు వేగం.. కర్రను గిరగిరా తిప్పుతూ చేసే విన్యాసాలు చూపరులను కట్టిపడేస్తాయి. ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో పండుగలు, జాతరల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కర్రసాము ఇప్పుడు జాతీయ క్రీడా వేదికపైకి చేరుతోంది. డిసెంబరు 11 నుంచి 22 వరకు తెలంగాణలో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తొలిసారిగా కర్రసాము పోటీకి చోటు దక్కింది. దేశం నలుమూలల నుంచి వచ్చే యువ క్రీడాకారులకు తెలంగాణ సంప్రదాయ యుద్ధ కళను పరిచయం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. హకీంపేటలోని రాష్ట్ర క్రీడా పాఠశాలలో ఈ ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఆధునిక క్రీడలకు ఆదరణ పెరుగుతున్న కొద్దీ ఒకప్పటి గ్రామీణ ఆటలు కనుమరుగవుతున్నాయి. తరతరాలుగా పెద్దల నుంచి పిల్లలకు సంక్రమించిన కళలు మరుగునపడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సంప్రదాయ కర్రసాముకు జాతీయ స్థాయిలో ప్రదర్శన అవకాశం లభించడం విశేషం.

ఆటే కాదు.. ఆత్మరక్షణ కళ

కర్రసాముకు తెలంగాణ గ్రామీణ జీవితంతో విడదీయరాని అనుబంధం ఉంది. పూర్వం గ్రామీణులు ఆత్మరక్షణ కోసం ఈ కళను నేర్చుకునేవారు. క్రమంగా పండుగలు, జాతరలు, ఊరేగింపుల్లో కర్రసాము విన్యాసాలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రదర్శనలను కర్రసేవగా పిలుస్తారు. కర్రసాములో రాణించేందుకు శారీరక బలం ఒక్కటే సరిపోదు. చురుకుదనం, ఏకాగ్రత, సమయస్ఫూర్తి ఎంతో ముఖ్యం. చేతులు, కాళ్ల కదలికల్లో సమన్వయం ఉండాలి. శరీరాన్ని సమతుల్యంగా ఉంచుకుంటూ విన్యాసాలు చేయగలగాలి. నిరంతర సాధనతోనే ఈ కళలో పట్టు సాధించగలరు. కర్రసాముకు ఖరీదైన క్రీడా పరికరాలు, భారీ మైదానాలు అవసరం లేదు. గ్రామాల్లోనే పిల్లలకు శిక్షణ ఇవ్వొచ్చు. చిన్నతనం నుంచే సాధన చేయడం వల్ల శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. బాలబాలికలకు వ్యాయామంతో పాటు క్రమశిక్షణ అలవడుతుంది.

అలంకారం.. యుద్ధం

కర్రసాములో ప్రధానంగా రెండు రకాల ప్రదర్శనలుంటాయి. ఒకటి అలంకారం.. మరొకటి యుద్ధం. అలంకార ప్రదర్శనలో ఒక్కో క్రీడాకారుడు కర్రతో వివిధ రకాల విన్యాసాలు చేస్తారు. విన్యాసాల్లో వేగం, నేర్పు, శరీర కదలికల్లో సమన్వయం ఇందులో ప్రధానంగా కనిపిస్తాయి. యుద్ధ ప్రదర్శనలో ఇద్దరు క్రీడాకారులు తలపడతారు. నిర్ణీత నియమాలకు లోబడి తమ నైపుణ్యాన్ని చాటుతారు. హకీంపేట క్రీడా పాఠశాలలో జరిగే కర్రసాము ప్రదర్శనల ద్వారా ఈ రెండు రూపాలను దేశంలోని వివిధ రాష్ట్రాల క్రీడాకారులకు పరిచయం చేయనున్నారు. ఈసారి కర్రసామును ప్రదర్శన క్రీడగానే చేర్చారు. పతకాల కోసం పోటీలు ఉండవు.

దేశీయ క్రీడలకూ పెద్దపీట

దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్రత్యేకమైన సంప్రదాయ క్రీడలకు ఖేలో ఇండియాలో ప్రాధాన్యమిస్తున్నారు. మహారాష్ట్రలో మల్లఖంబ్, కేరళలో కలరిపయట్టు, పంజాబ్‌లో గత్కా, మణిపుర్‌లో థాంగ్--టా ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఖేలో ఇండియా పోటీలతో ఈ క్రీడలు ఆయా రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా యువతకు పరిచయమవుతున్నాయి. ఇప్పుడు తెలంగాణ కర్రసాముకూ ఆ అవకాశం దక్కింది. ఈసారి ఖేలో ఇండియాలో మల్లఖంబ్‌లో 9, కలరిపయట్టు, థాంగ్--టా, యోగాసనలో ఎనిమిది చొప్పున, గత్కాలో ఆరు ఈవెంట్లు నిర్వహించనున్నారు. ఐదు సంప్రదాయ క్రీడల్లో కలిపి 39 ఈవెంట్లు ఉన్నాయి. దేశీయ, గ్రామీణ, గిరిజన క్రీడలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా పథకంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆయా క్రీడలకు అవసరమైన సామగ్రిని సమకూర్చడం, శిక్షణ సదుపాయాలు కల్పించడం, శిక్షకులను తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది.

కర్రసాముపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

తెలంగాణ సంప్రదాయ క్రీడలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఖేలో ఇండియా ఏర్పాట్లపై ఇటీవల జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కర్రసాము ప్రత్యేక సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించారు. జాతీయ క్రీడలకు హాజరయ్యే క్రీడా నిపుణులు, శిక్షకులు, వివిధ రాష్ట్రాల క్రీడా సంఘాల ప్రతినిధులు కర్రసాము విశిష్టతను తెలుసుకునేందుకు ఈ ప్రదర్శనలు దోహదపడతాయి. గ్రామాల్లో కర్రసాములో నైపుణ్యం ఉన్నవారిని గుర్తించి వారి ద్వారా యువతకు శిక్షణ ఇప్పించవచ్చు. క్రమం తప్పకుండా ప్రదర్శనలు, పోటీలు నిర్వహిస్తే ఈ కళకు మరింత ఆదరణ పెరిగే అవకాశముంది. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. ఇప్పుడు తెలంగాణ పల్లెల్లోని క్రీడా వారసత్వాన్ని దేశానికి చాటే అవకాశం వచ్చింది. నిన్నటివరకు ఊరి జాతరల్లో కనువిందు చేసిన కర్రసాము.. రేపు జాతీయ క్రీడా వేదికపై అలరించనుంది.

షాద్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. తృటిలో తప్పిన పెను ప్రమాదం

లారీ ఢీకొనడంతో ఎంఎస్ఎన్ కంపెనీ ఉద్యోగుల బస్సు వెనుక భాగం నుజ్జునుజ్జు

పలువురు ఉద్యోగులకు గాయాలు.. ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు

రోడ్డుపక్కన బస్సు నిలిపిన తీరుపై స్థానికుల అనుమానాలు



షాద్‌నగర్ నియోజకవర్గ సీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 27:రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని బాలాజీ టౌన్‌షిప్ ఎదురుగా ఓల్డ్ హైవేపై శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం సుమారు 8 గంటల సమయంలో వేగంగా వచ్చిన ఓ లారీ, ఎంఎస్ఎన్ కంపెనీకి చెందిన ఉద్యోగుల బస్సును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక భాగం పూర్తిగా ధ్వంసమై నుజ్జునుజ్జయింది.
ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ఉద్యోగులు, సిబ్బందికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను షాద్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.లారీ ఢీకొట్టిన తీవ్రతకు బస్సు వెనుక భాగం పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాద తీవ్రత స్పష్టమవుతోంది. అయితే ఉద్యోగులను ఎక్కించుకునేందుకు బస్సును ప్రధాన రహదారి పక్కన నిలిపిన తీరుపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బస్సును ప్రమాదకరమైన ప్రదేశంలో నిలపడం కూడా ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.
ఉదయం ఉద్యోగాలకు వెళ్లే సమయం కావడంతో ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేగింది. బస్సులో పలువురు ఉద్యోగులు ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో పెను ప్రాణనష్టం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారులపై కంపెనీ బస్సులను ఇష్టానుసారంగా నిలిపివేయకుండా నియంత్రించడంతో పాటు, అతివేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కుర్రసాము పోటీలు ప్రారంభం



కురవి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నల్ల బెల్లం, పటిక, నాటుసారా తరలిస్తున్న మహీంద్రా జైలో వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం కురవి గ్రామ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను గమనించి వెనక్కి వెళ్లేందుకు ప్రయత్నించిన వాహనాన్ని వెంబడించి అయ్యగారిపల్లి సమీపంలో అడ్డుకున్నారు. తనిఖీ చేయగా 10 క్వింటాళ్ల పటిక, 2 క్వింటాళ్ల నల్ల బెల్లం, 20 లీటర్ల నాటుసారా లభించాయి. వీటి మొత్తం విలువ రూ.54 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వాహనం నడుపుతున్న బనోత్ ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని, అతనికి సహకరించిన పెద్దగూడూరుకు చెందిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై జతీ.చీశీ.254/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

జనసేన పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల

- గ్రాడ్యుయేట్ ఎక్స్క్లూస్ ప్రచారం జనసేన పార్టీ ఖమ్మం, నల్లగొండ, వరంగల్
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు.

సి కె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :విజయమే లక్ష్యంగా చింతకాని మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్స్ నిరుద్యోగ యువకుల్ని మరియు చింతకాని హెడ్ క్వార్టర్, పందిళ్ళపల్లి, జగన్నాధపురం, నామవరం, అనంతసాగర్, గాంధీనగర్ కాలనీ పందిళ్ళపల్లి ప్రభుత్వ పాఠశాలలోని గ్లాడియేట్స్ ఓటర్స్ కలిసి విస్తృత ప్రచారం చేసిన మధిర నియోజకవర్గం నాయకులు తాళ్లూరు డేవిడ్ మరియు చింతకాని మండలం జనసేన పార్టీ కోఆర్డినేటర్స్ చింతాల నరేష్ వర్మ . షేక్ అమిద్ , మహేష్, వెంకటేష్, శ్రీనివాసరావు. జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు



అందరూ కలిసి విస్తృత ప్రచారం చేశారు. ప్రజల గొంతుకగా, పట్టభద్రుల హక్కుల కోసం నిరంతరం కృషి నాయకుడిని గెలిపించుకుందాం.
మన ఓటు-మన భవిష్యత్తు మన అభ్యర్థి-డాక్టర్ గడల శ్రీనివాసరావు జనసేన పార్టీ జెండా రెపరెపలాడాలి...పట్టభద్రుల ఆశయాలు నెరవేరాలి. చింతాల నరేష్ వర్మ జనసేన పార్టీ చింతకాని మండలం నాయకులు.

గూడూరులో నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

- నూతన గృహంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి
- గూడూరులో కావలి కృష్ణ గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు సి కె న్యూస్ నవంబర్ 27: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు మండలం గూడూరు గ్రామంలో కావలి శిరీష--కృష్ణ దంపతుల నూతన గృహప్రవేశ వేడుక లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఈ శుభకార్యానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, కావలి కృష్ణతో పాటు వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో అడుగుపెట్టిన ఆ కుటుంబం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ తాండ సర్పంచ్ మీనాక్షి దశరథ్, నాయక్ మల్లాపూర్ ఉపసర్పంచ్ శంకర్, గూడూరు మాజీ ఎంపీటీసీ దర్శన్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు పెండ్లి మడుగు రాజు గౌడ్, కొత్తూర్ శివచారి, వార్డ్ మెంబర్ గుండు జ్ఞానేశ్వర్,గుండు సిద్ధు, గుండు శివరాజ్,గుండు శేఖర్, ఉప్పల మనోహర్ గుప్త దయానంద్, ఉప్పల రఘు గుప్త తదితరులు పాల్గొని నూతన గృహప్రవేశ దంపతులకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

షాద్ నగర్ లో కార్తిక కోటి దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

- దీపాల వెలుగులు ప్రతి ఇంటా సుఖసంతోషాలను నింపాలి
- అంగరంగ వైభవంగా కార్తీక కోటి దీపోత్సవం..
- శివలింగాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



షాద్ నగర్ నియోజకవర్గం సీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 27:షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కోటి దీపోత్సవ నిర్వహణ కమిటీ షాద్‌నగర్ ఆధ్వర్యంలో పట్టణంలో కార్తీక కోటి దీపోత్సవ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శివలింగాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి హాజరై శివలింగాభిషేకం నిర్వహించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. కార్తీక మాసంలో నిర్వహించే కోటి దీపోత్సవం హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. దీపాల వెలుగులు ప్రతి ఇంటా సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. గోపూజతో పాటు లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా, అదృష్టంగా ఉందన్నారు. దైవకృపతో షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఇంతటి బృహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన కోటి దీపోత్సవ కమిటీ సభ్యులను ఎమ్మెల్సీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మహోత్సవంలో కమిటీ నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీఎస్ సుధీర్, ప్యాట అశోక్, మాజీ కౌన్సిలర్ కానుగ అనంతయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి, మహాదేవ్‌పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కట్ట రవీందర్, నాయకులు హరీష్ శర్మ, శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, జంగయ్య, నరేందర్, సంజీవ రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, సరిత తిరుపతయ్య..

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు 539వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ సహకార కార్పొరేషన్ చైర్ పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్య క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక జయంతి వేడుకలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి,ఏఐసీసీ కార్యదర్శి,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సరిత తిరుపతయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భక్త కనకదాసు తన భక్తి,ఆధ్యాత్మిక చింతన,సమానత్వ భావనలతో సమాజానికి గొప్ప సందేశాన్ని అందించారని పేర్కొన్నారు.కులమతాలకు అతీతంగా మానవత్వం,సమానత్వం,సోదరభావంతో కూడిన సమాజ నిర్మాణానికి ఆయన బోధనలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ నీలి శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ సంకాపురం రాములు,మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ఆయా గ్రామాల సర్పంచ్ లు,కౌన్సిలర్లు,కురువ సంఘం నాయకులు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన మాజీ ఎమ్మెల్యే



షాద్ నగర్ నియోజకవర్గ కేశంపేట్ సీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 27:షాద్ నగర్ నియోజకవర్గ కేశంపేట గ్రామపంచాయతీ పరిధిలో కష్టసుఖాల్లో ప్రజలకు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆపదలో ఉన్న కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ఇటీవల కేశంపేట గ్రామానికి చెందిన సయ్యద్ అసిఫ్ మృతి చెందడంతో ఆయన తండ్రి సయ్యద్ రజాక్‌తో పాటు కుటుంబ సభ్యులను అంజయ్య యాదవ్ పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యంతో ఉండాలని సూచించారు.అదేవిధంగా అల్వాల గ్రామానికి చెందిన తిరుమల్ రెడ్డి రాజు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను సైతం పరామర్శించి, తమ సానుభూతిని తెలియజేశారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాల బాధలో తాము భాగస్వాములమని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఈట గణేష్, దేవేందర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కల లక్ష్మీనారాయణ గౌడ్, రమేష్ యాదవ్, నవీన్ కుమార్, జమాల్ ఖాన్, లక్ష్మీనారాయణ, ప్రేమ్ కుమార్ గౌడ్, సాజిద్, శ్రీనివాస్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం నాయకత్వంలో నెరవేరినది

గద్వాల మండలం ఇందిరమ్మ ఇళ్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పరిధిలోని గోనుపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లిఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. గోనుపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు మినాహజ్ హాలి నేడు ఇళ్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగిందిలి . నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు . ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ .... నూతన ఇందిరమ్మ ఇళ్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల



రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు.

ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు. లిఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరఫున ధన్యవాదాలు .....

ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ...

ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం కి మంత్రి గారికి మా ఎమ్మెల్యే కి రుణపడి ఉంటామని ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచులు సంఘం మాజీ అధ్యక్షులు మాజీద్, మాజీ ఆలయం కమిటీ ఛైర్మెన్ సతీష్, నాయకులు అజయ్, మైలగడ్డ చంద్రశేఖర్, నారాయణ రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రిసెప్షన్ వేడుకకు & శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, హనుమాన్ పూజా కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు హనుమంతు నాయుడు

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల : ఈరోజు గద్వాల నియోజకవర్గం కేటీదొడ్డి మండలం రంగాపురం గ్రామంలో బైరం జయప్ప కుమార్తె పల్లవి వెడ్స్ శివ ల రిసెప్షన్ వేడుకకు హాజరై, నూతన వధూవరులకు తలంబ్రాలు వేసి, ఆశీర్వదించారు ..అదే విధంగా, గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు దొదర్ పల్లి కాలనీ లో పెద్దింటి ముంతన్న స్వగృహంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, హనుమాన్ పూజా కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఆశీస్సులను పొందారు....

వీరి వెంట,రాజారెడ్డి,అల్లపాడు ప్రతాప్, లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకటేష్ నాయుడు,జాంపల్లి భరత్ సింహారెడ్డి, తిరుమలేష్,రాముడు,ప్రభాకర్,అరవింద్,రాము, నరసింహులు,చాకలి శ్రీనివాసులు, మోహన్,మరియు తదితరులు ఉన్నారు....



కురుమల సంక్షేమం గురించి ఆలోచించిన ఏకైక నాయకుడు కేసీఆర్...



- భక్త కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి
- బాసు హనుమంతు నాయుడు

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు గద్వాల నియోజకవర్గం కేటి దొడ్డి మండలం చింతలకుంట మరియు గట్టు మండలం బల్గెర,ఆలూరు గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు 539వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలవేసి, కొబ్బరికాయ కొట్టి,నివాళులర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.... అనంతరం,బాసు హనుమంతు నాయుడు ని కురువ సంఘం సభ్యులు శాలువలతో ఘనంగా సత్కరించారు....అంతకముందు,బాసు హనుమంతు నాయుడుని కురువ కులస్తులు డోలు మేళాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు....

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నియోజకవర్గ కురుమ కులస్తులందరికీ శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు జయంతి శుభాకాంక్షలు తెలిపారు....కురుమ కులస్థులు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో గొర్రెలను పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు...శ్రీకృష్ణునికి గొప్ప భక్తుడైన కనకదాసు ఆధ్యాత్మిక కవిగా, తత్వవేత్తగా, సంగీతకారుడు, స్వరకర్తగా తన సంకీర్తనలతో సాధారణ ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపించిన గొప్ప సంకీర్తనాచార్యుడని కొనియాడారు. మాదాసీ,కురువలు విద్య,ఆర్థిక రంగాల్లో ఎదగాలని,ప్రతీ ఒక్కరూ చైతన్యవంతులు కావాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అన్ని కులాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు....ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, అల్లపాడు ప్రతాప్,సర్పంచు సాకి డేవిడ్,బాసు గోపాల్,నూర్ పాషా,లక్ష్మీకాంత్ రెడ్డి,పటేల్ రాజు, వెంకటేష్ నాయుడు,విజయ్, జాంబయ్య,జాంపల్లి భరత్ సింహారెడ్డి, తిరుమలేష్,కిష్టప్ప,ఈరన్న,జనార్దన్,వెంకటేష్,ఉలిగప్ప,ఇంజనన్న,శ్రీకాంత్, రమేష్, వినయ, డీకే.భీమయ్య, రాముడు, అరవిందు, జయరాముడు,రాము, నరసింహులు, మద్దిలేటి,తిమ్మప్ప,లక్ష్మణ, హనుమంతు, ఆంజనేయులు,రవి, పరశురాముడు,రంగస్వామి,వీరేష్, రాజు,మరియు నాయకులు,కురుమ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.....

షాద్‌నగర్‌లో పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల ప్రత్యేక కార్యాచరణ

చౌరస్తా వద్ద ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించిన సీఐలు సీతారాం, వెంకటేశ్వర్లు

షాద్‌నగర్ నియోజకవర్గ సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 27:షాద్‌నగర్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా షాద్‌నగర్ పోలీస్ సీఐ సీతారాం, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు పట్టణంలోని ప్రధాన చౌరస్తా పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు సీఐ సీతారాం స్పందిస్తూ.. ఒక సంవత్సరంలో 500 మీటర్ల పరిధిలో ఐదు రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాన్ని ప్రమాదకర ప్రాంతంగా (బ్లాక్ స్పాట్) గుర్తిస్తామని తెలిపారు. ఈ ప్రమాణాల ప్రకారం షాద్‌నగర్ పరిధిలో ఐదు ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించినట్లు వెల్లడించారు.వాటిలో కేశంపేట రోడ్డు (బైపాస్), అను టీ జంక్షన్--మహబూబ్‌నగర్ రోడ్డు, రాయికల్ టోల్‌ప్లాజా



సమీప ప్రాంతం, దూసకల్ రోడ్డు (బైపాస్), ఎలికట్ట రోడ్డు ఉన్నాయి.ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు చౌరస్తా విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని సూచించారు.ఈ పరిశీలనలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నరసింహులు, వెంకటేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.